# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 5 ఆగస్టు 2025 | సంపుటి:9 | సంచిక:219 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## శ్రీకృష్ణుడే మొదటి రాయబారి



2

## 'పరీక్షా పే చర్చ'కు గిన్నీస్ రికార్డు




2



# ఉద్యమాల సూరీడు శిబూ సోరెన్ కన్నుమూత

ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనోద్యమ కర్త..
గిరిజన పోరాట యోధుడి మృతికి
కన్నీరు పెట్టిన ఝార్ఖండ్ ప్రజలు

2

శిబును బీహార్ వాసులు
దిషోమ్ గురూజీగా కీర్తిస్తారు

మూడు సార్లు ముఖ్యమంత్రి అయిన సోరెన్
కుమారుడు హేమంత్ ఝార్ఖండ్ సీఎంగా ఉన్నారు



రాష్ట్రపతి, ప్రధాని నివాళులు 2

## రాష్ట్ర అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వం చేయూత

### మంత్రి నారాయణ




**విజయవాడ:** సింగపూర్‌తో చేసుకున్న ఒప్పందాలను గత ప్రభుత్వం రద్దు చేసిందని ఏపీ మంత్రి నారాయణ విమర్శించారు. తిరిగి సంబంధాల పునరుద్ధరించేందుకే ఆ దేశం వెళ్లామన్నారు. సింగపూర్ ప్రభుత్వం రాష్ట్ర అభివద్ధికి సహకరించేందుకు ముందుకువచ్చిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో మున్సిపల్ కమిషనర్లు, అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ఏపీలో 7 వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటుచేశామని తెలిపారు. అక్టోబర్ 2 నాటికి 85 లక్షల టన్నుల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేస్తామన్నారు. కలుషిత నీటి శుద్ధికి ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రానికి స్వచ్ఛభారత్‌లో ఐదు అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. అవార్డులు సాధించిన అధికారులకు అభినందనలు తెలిపారు.

## ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్ ప్రమాణం



**అమరావతి, (మనం న్యూస్):** ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ప్రమాణస్వీకారం చేయించారు. తుహిన్ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. తుహిన్ కుమార్ స్వస్థలం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కత్తుల కవిటి గ్రామం. 1994 మార్చి 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఆయన

...మిగతా 2లో



# సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి

## విజన్, పీపుల్, నేచర్, టెక్నాలజీలకు ప్రాధాన్యం

ఒక పరిశ్రమ వేస్ట్.. మరో పరిశ్రమకు ముడిసరుకు

అభివృద్ధి సూచికలపై చంద్రబాబు సమీక్ష

**అమరావతి, (మనం న్యూస్):** ఒక పరిశ్రమలో తయారైన వేస్ట్ మరో పరిశ్రమకు ముడి సరకు అయ్యేలా సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలని సిఎం చంద్రబాబు సూచించారు. అత్యుత్తమ సాంకేతికతను పాలనకు అనుసంధానించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉత్పత్తులకు విలువ జోడింపు కీలకమన్న సీఎం.. దాని ద్వారానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. విజన్, పీపుల్, నేచర్, -టెక్నాలజీలకు ప్రాధాన్యమిస్తూ చేసే పాలనతో అత్యుత్తమ ఫలితాలు వస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి,

...మిగతా 2లో

### మద్యం ఆదాయమే కాదు... ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యం

గత ప్రభుత్వంలో నాణ్యతలేని మద్యంతో ప్రజల ప్రాణాలు హరించారు

మద్యం పాలసీపై అధికారులతో సీఎం సమీక్ష

2

## మరువలేనివి ఈ క్షణాలు

### కేంద్రమంత్రి పెమ్మసాని



**ఢిల్లీ,(మనం న్యూస్):** కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో వెళ్లి ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. ఈ అమూల్యమైన క్షణాలు మరువలేనివని పెమ్మసాని పేర్కొన్నారు. ఈ మేరకు తన కుటుంబంతో ప్రధానిని కలిసిన ఫొటోలను సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు. "ఈరోజు ప్రధాని నరేంద్రమోదీని కుటుంబసభ్యు లతోపాటు మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం లభించింది. ఈ అమూల్యమైన క్షణాలు మరువలేనివి. ప్రధాని తన విలువైన సమయాన్ని కేటాయించినందుకు మా కుటుంబం తరపున మనస్ఫూర్తిగా కతజ్ఞతలు. మోదీ దూరదష్టి గల నాయకత్వం, అంకితభావం, వినయ శీలతతో కూడిన వ్యక్తిత్వం మమ్మల్ని ఎంతో ప్రభావితం చేసింది. ఈ క్షణాలు మాకు ఎప్పటికీ గుర్తుం డిపోతాయి" అని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

### మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



**అమరావతి, (మనం న్యూస్):** ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామని ఏపీ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 'స్త్రీ శక్తి' పేరుతో ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం సమర్థంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయొచ్చు. మహిళలు తమ ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డుల్లో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది. 6,700 బస్సుల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. దీనికోసం రూ.1,950 కోట్ల వ్యయం అవుతుంది. 3వేల విద్యుత్ బస్సుల కొనుగోలుకు సీఎం ఆదేశించారు. రానున్న రెండేళ్లలో 1,400 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తాం" అని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

# పీజీ వైద్య కోర్సుల్లో ప్రభుత్వ కోటా

### 15 శాతం పనిచేసే వైద్యులకు రిజర్వ్

### వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడి



**అమరావతి, (మనం న్యూస్):** 2025-26 విద్యా సంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పి.జి) వైద్య విద్య కోర్సుల ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యుల రిజర్వేషన్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదించారు. 2028-29 సంవత్సరంలో ప్రభుత్వా సుపత్రుల్లో క్లినికల్,నాన్ -క్లినికల్ స్పెషలిస్టుల అవసరాలను మదింపు చేసి ప్రభుత్వం రిజర్వేషన్ కోటాపై నిర్ణయం తీసుకొంది. దీంతో పాటు- ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పి హెచ్ సీ లు ) పనిచేసే వైద్యుల

...మిగతా 2లో

## రాష్ట్రపతితో భేటీ అందుకేనట

ప్రధాని, కేంద్ర హోంమంత్రి ముర్ముతో సమావేశమైంది జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ చర్చల కోసమేనంటున్నవార్తలు

2

## మరిన్ని ప్రతికార సుంకాలు

భారత్‌పై పేలుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

2

## ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు

2

## తిరుమల భద్రతకు టీటీడీ పెద్దపీట




### ఆధార్ వివరాలు తీసుకోమంటే విమర్శలా?

### భూమన వ్యాఖ్యలపై మండిపడ్డ భాను ప్రకాశ్

**తిరుమల, (మనం న్యూస్):** టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి స్పందించారు. తిరుమలలో ఏదో జరిగిపోతుందని భూమన కరుణాకర్ రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం తిరుమలలో భానుప్రకాష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తిరుమలలో ఉగ్రదాడులు

...మిగతా 2లో



## అప్పటి వరకు శాంతి సాధ్యం కాదు

- భారత్, పాకిస్థాన్ల మధ్య సంబంధాలు మెరుగుపడే వరకు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద సమస్య పోదు
- జమ్మూకశ్మీర్ మాజీ మఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా

2

# మద్యం ఆదాయమే కాదు... ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యం



**అమరావతి:** మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒల్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. సోమవారం సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై రివ్యూ చేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు- సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్ధతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే సూచన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో...అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు. పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ- డిస్టిల్డ్ లిక్కర్ (ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు.

## సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి సూచికలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యమని సీఎం అన్నారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలని.. కనీస అవసరాలు అందించాలని దిశానిర్దేశం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ.3,47,871 సాధించాలని, దానికి అనుగుణంగా 2029 నాటికి రూ. 5.42 లక్షలు తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టు-కోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా విజన్ ఉండాలన్నారు. పథకాలతో పాటు- వారి ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనింగ్, వ్యవసాయ ఉత్పత్తుల్లో జీవీఏ ప్రధాన అంశమన్నారు. జీఎస్డీపీ వృద్ధి చెందితేనే ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి అందించగలమని చెప్పారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా ఏపీ తయారు కావాలని సీఎం ఆకాంక్షించారు.

## ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

పేరు నమోదైంది. 2000-2004 మధ్య హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా సేవలు అందించారు. 2010-14 మధ్య జీఎంసీ తరఫున హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2016-17లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

## పీజీ వైద్య కోర్సుల్లో ప్రభుత్వ కోటా

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షలను కూడా పరిగణలోకి తీసుకుని రిజర్వేషన్ కోటా విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు- వైద్యరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ తెలిపారు. 2025-26 సంవత్సరంలో జరిగే పి. జి. వైద్య విద్య కోర్సుల్లో జరిగే ప్రవేశాలల్లో 7 క్లినికల్ సబ్జెక్టుల్లో ప్రభుత్వ పిహెచ్ సీ వైద్యులకు 15శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ, ఎనస్తీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ మరియు రైడియాలజీ కోర్సుల్లో ఈ మేరకు రిజర్వేషన్ కల్పించారు. మొత్తం 17 కోర్సుల్లో పి. జి ప్రవేశాలు జరుగుతాయి. ప్రవేశాలు జరిగే మొత్తం 9నాన్ - క్లినికల్ కోర్సులో 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విభాగాలు హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, బయో కెమిస్ట్రీ, ఏనాటమీ, ఫిజీయాలజీ, ఫారెన్సిక్ మెడిసిన్, మైక్రోయ్బాలజీ, పాథాలజీ, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్. 1144 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే 2288 వైద్యుల ఆశలు, ఆకాంక్షలను కూడా దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్ పై నిర్ణయం తీసుకున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంత్రిత్వ శాఖ కార్యదర్శి తో కూడిన ఆరుగురు ఉన్నతాధికారుల కమిటీ- 2028-29 సంవత్సరంలో స్పెషలిస్ట్ ల అవసరం పై మదింపు చేసి వివిధ విభాగాల్లో అవసరాలను గుర్తిస్తూ నివేదిక ఇచ్చిందని మంత్రి వివరించారు. ఉన్నత విద్య పొందాలనే ప్రభుత్వ వైద్యుల ఆశలు, ఆకాంక్షలను కూడా పరిగణలోకి తీసుకుని అవసరాల కంటే ఎక్కువగా ప్రభుత్వ వైద్యులకు పి.జి కోర్సుల్లో రిజర్వేషన్లు కల్పించాలని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రవేటు- వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద లభించే 50శాతం పి.జి కోర్సుల్లో ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్ కోటా మేరకు ప్రభుత్వ వైద్యులకు ప్రవేశాలు లభిస్తాయి. 15 శాతం రిజర్వేషన్ ప్రకారం 7 క్లినికల్ విభాగాల్లో 154 సీట్లు-, 9 నాన్ -క్లినికల్ విభాగాల్లో 30???రిజర్వేషన్ మేరకు 118 సీట్లు- ప్రభుత్వ వైద్యులకు అందుబాటు-లో ఉంటాయి. ఈ విధంగా మొత్తం 272 సీట్లను ప్రభుత్వం పీ హెచ్ సి వైద్యులకుకేటాయించింది. 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన పిజి వైద్య విద్య ప్రవేశాల్లో 312 మంది ప్రభుత్వ వైద్యులు ప్రవేశాలు పొందారు. ప్రభుత్వ వైద్యుల డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. గతానికి భిన్నంగా మూడవ రౌండ్ కౌన్సిలింగ్ పూర్తయ్యేవరకు పజి కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ప్రవేశాలను కల్పించాలన్న డిమాండ్ కు ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటి వరకు.. రెండవ రౌండ్ కౌన్సిలింగ్ పూర్తయిన తరువాత ప్రభుత్వ వైద్యులకు కేటాయించిన సీట్లలో మిగిలిన సీట్లను ఇతరులకు కేటాయించేవారు. ఈ సంవత్సరం జరిగే ప్రవేశాల్లో.. మూడవ రౌండ్ కౌన్సిలింగ్ పూర్తయిన తరువాత మిగిలిన సీట్లను ఇతరులకు కేటాయిస్తామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ పిహెచ్ సి ల్లో 3 సంవత్సరాల సర్వీసు చేసిన వైద్యులు పిజి కోర్సుల్లో రిజర్వేషన్ కోటాలో ప్రవేశాలు పొందేందుకు అర్హులు.

## తిరుమల భద్రతకు టీటీడీ పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల హెచ్చరికలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. మూడంచెల భద్రతలో భాగంగా శ్రీవారి ఆలయం, భక్తులకు టీటీడీ భద్రత కల్పిస్తోందని భానుప్రకాష్ రెడ్డి ఉద్ఘాటించారు. భక్తుల భద్రత కోసమే మఠాలకు నోటీసులు ఇచ్చామని భానుప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. స్వామి వారికి నిత్య కైంకర్యాలు చేస్తున్న మఠాలు, పీఠాధిపతులంటే టీటీడీకి చాలా గౌరవం ఉందని ఉద్ఘాటించారు. మఠాల్లోనూ భక్తుల ఆధార్ వివరాలు తీసుకొని వసతులు కల్పించాలని నోటీసులు ఇచ్చామని గుర్తుచేశారు. తిరుమలలో భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు- చేయాలని సూచించామని పేర్కొన్నారు. వివరాలు తీసుకోవాలంటే.. హిందూధర్మం, మఠాలపై దాడి అని భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడతారా.. అని ప్రశ్నించారు. తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చింది వైసీపీయేనని భానుప్రకాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఏఐ టెక్నాలజీని వినియోగించి భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించడం సాధ్యం కాదంటూ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఖండించారు. టె-క్నాలజీపై అవగాహన లేకుండా ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. భక్తులకు సులభతరంగా దర్శనం కల్పించే అంశంపై అధ్యయనం చేసేందుకు గూగుల్, టీసీఎస్ సంస్థలు ముందుకు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ సంస్థలు టీటీడీకి ఉచితంగా సేవలు అందిస్తున్నాయని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. దాతల సహాయంతో చేస్తున్న పనిని కూడా వృథా అనడాన్ని ఎల్వీ సుబ్రహ్మణ్యం విజ్ఞతికే వదిలేస్తున్నానని హితవు పలికారు.



## మరిన్ని ప్రతీకార సుంకాలు

**హైదరాబాద్, ఆగస్టు 4:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ఇటీవలే 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. ఇప్పుడు మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపించారు. భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యాకు భారీగా ఆర్థిక వనరులు చేకూరుతున్నాయని, అందుకే ఉక్రెయిన్ తో యుద్ధం ఆపడం లేదని విమర్శించారు. ఈ మేరకు ఆయన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్లో పోస్టు చేశారు. 'రష్యాతో యుద్ధం వల్ల ఉక్రెయిన్లో ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో వాళ్లకు అవసరం లేదు. అందుకే భారత్ పై సుంకాలను మరింత పెంచబోతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

## రాష్ట్రపతితో భేటీ అందుకేనట

**ప్రధాని, కేంద్ర హోంమంత్రి ముర్మును తో సమావేశమైంది జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ చర్చల కోసమేనంటున్న వార్తలు**



**ఢిల్లీ, ఆగస్టు 4:** ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్లో సమావేశమైన సంగతి పాఠకులకు విదితమే. ఈ వరుస భేటీలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడకపోయినప్పటికీ.. పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమేనంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆరేండ్లు పూర్తవుతున్న తరుణంలో జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ మొదలైంది.బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని ప్రధాని మోడీ కలవడం ఇదే తొలిసారి. తర్వాత కొన్ని గంటలకు తర్వాత అమిత్ షా కూడా ముర్ముతో సమావేశమయ్యారు. రాష్ట్రపతితో సమావేశం అనంతరం హోంమంత్రి జమ్మూకశ్మీర్ నేతలను కలిశారు. దాంతో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా అన్న వార్తలకు బలం చేకూరుతోంది. జమ్మూకశ్మీర్కు ప్రత్యేక హోదాను కల్పించే 370 ఆర్టికల్ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. కచ్చితమైన గడువు నిర్దేశించనప్పటికీ.. రాష్ట్రహోదా పునరుద్ధరణకు పలుమార్లు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

## ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు

**పాట్నా, ఆగస్టు 4:** ఆర్‌జేడీ నేత, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌పై పాట్నాలోని దిఘా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఆయనకు రెండు ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయంటూ న్యాయవాది రాజీవ్ రంజన్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంది. శనివారం తేజస్వీ ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ తన పేరు సరికొత్త ఓటర్ల జాబితా నుంచి మాయమైందని ఆరోపిం చారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన ఎన్నికల అధికారులు జాబితాలను తెప్పించుకొని వెతికారు. బీహార్ యానిమల్ సైన్సెస్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బిల్డింగ్‌లోని పోలింగ్ బూత్ 204లో దానిని గుర్తించారు. జాబితాలో 416 నెంబర్లో తేజస్వీ వివరాలున్నాయని పేర్కొన్నారు. వాస్తవానికి అంతకు ముందు తేజస్వీ ఎన్నికల కమిషన్ను ఉద్దేశించి మాట్లాడుతూ అసలు తన పేరే ఓటర్ జాబితాలో లేదని సంచలన ప్రకటన చేశారు.బీహార్‌లో ఓటర్ల ముసాయిదా జాబితాను ఈసీ విడుదల చేసిన రోజే ఎన్నికల కమిషన్ బీజేపీ కోసం ఓట్లను చోరీ చేసిందంటూ ప్రతిపక్ష నేత రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో తేజస్వీ ప్రకటన రావడం గమనార్హం.

## 'పరీక్షా పే చర్చ'కు గిన్నీస్ రికార్డు

**ఢిల్లీ, ఆగస్టు 4:** పరీక్షలనగానే విద్యార్థుల్లో నెలకొనే భయాందోళన, ఒత్తిడిని పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం గిన్నిస్ వరల్ రికార్డు లో చోటు దక్కించుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా ఈ విశేషాన్ని షేర్ చేశారు. ఈ ఘనత తనకు వ్యక్తిగతంగానూ ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ ఏడాది నిర్వహించిన 8వ ఎడిషన్ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి నెల రోజుల్లోనే దాదాపు 3.53 కోట్ల మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, 21 కోట్ల మందికి పైగా టీవీల్లో వీక్షించడంతో ఇది ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ చిరస్మరణీయ ఘనత సాధించిన వేళ మోడీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరికీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గిన్నిస్ వరల్ రికార్డ్స్ సిబ్బంది ఈ సర్టిఫికెట్‌ను అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద, పాఠశాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడే మొదటి రాయబారి

- **వ్యాఖ్యానించిన సుప్రీం కోర్టు**

**ఢిల్లీ, ఆగస్టు 4:** యూపీ ప్రభుత్వం, శ్రీ బాంకే బిహారీ టెంపుల్ ట్రస్ట్ వివాదం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శ్రీకృష్ణుడే మొదటి రాయబారి అని.. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలంటూ ఇరుపక్షాలకు సూచించింది. ఇందుకోసం ఒక కమిటీని ప్రతిపాదించింది. ఆలయ నిధుల నుంచి రూ.500 కోట్లతో కారిడార్ ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తూ ఉత్తర్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విచారణ సందర్భంగా శ్రీకృష్ణుడి రాయబారం గురించి సర్వోన్నత న్యాయస్థానం ప్రస్తావించింది. ఆర్డినెన్సును ఆమోదించడంలో తొందర ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీని రాజ్యాంగబద్ధతను పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది.

## ఉద్యమాల సూరీడు శిబూ సోరెన్ కన్నుమూత

**ఢిల్లీ, ఆగస్టు 4:**ఝార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ కన్నుమూశారు. గత కొద్ది కాలంగా ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో మూత్రపిండాల వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు. ప్రస్తుతం బీహార్ లోని రామ్ గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. హేమంత్ సోరెన్ ప్రస్తుతం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. దుర్గా సోరెన్ మృతి చెందారు. సంతాల్ కమ్యూనిటీకి చెందిన శిబు సోరెన్ వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోలతో కలిసి 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)ను ఏర్పాటు చేశారు. ఆ సంస్థతోనే ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో జాతీయ నేతగా ఎదిగారు. ఆయన పోరాట ఫలితంగా 2000లో ఝార్ఖండ్ రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, మూడు సార్లు సీఎం బాధ్యతలు చేపట్టినప్పటికీ ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్లో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. శిబూ సోరెన్ కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్ సభ, రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. శిబూ సోరెన్ భౌతికకాయాన్ని సాయంత్రం 4 గంటల సమయంలో రాంచీకి తరలించి, అనంతరం మొరాబాది ప్రాంతంలోని ఆయన నివాసానికి తీసుకెళ్తామని ఝార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ వెల్లడించారు.





### రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

రాష్ట్రపతి, ప్రధాని వేర్వేరుగా ఆస్పత్రిని సందర్శించి శిబూ సోరెన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు తమ సానుభూతిని వ్యక్తపరిచారు. గిరిజన, పేద, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించేందుకు శిబూ సోరెన్ ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు సోరెన్కు నివాళులర్పించారు.

### హేమంత్ ఉద్వేగం..

'మన ప్రియనేత దిషోమ్ గురూజీ మనల్ని విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది' అని శిబు సోరెన్ కుమారుడు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తన ఎక్స్ ఖాతాలో ఉద్వేగపూరితంగా ప్రకటించారు.

### పోరాట యోధుడు గురూజీ : సీఎం రేవంత్ సంతాపం

జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలో, గిరిజన సమస్యల పరిష్కారంలో మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబు సోరెన్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన సీఎం వడ్డీ వ్యాపారుల ఆగడాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులోనూ సోరెన్ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు సోరెన్ ఎప్పుడూ మద్దతు తెలిపేవారనీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం చివరి వరకు ఆయన మద్దతుదారుగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఆదివాసీ సమాజానికి సోరెన్ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయనీ, ఎనిమిదిసార్లు లోక్‌సభ సభ్యునిగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా, జార్ఖండ్ ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోరెన్ కుమారుడు, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆయన కుటుం సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి సానుభూతి తెలిపారు.

## రూ.7.08లక్షల కోట్ల జీఎస్టీ పన్ను ఎగవేత

- **కేంద్రమంత్రి పంకజ్ చౌదరి వెల్లడి**

**న్యూఢిల్లీ:** 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్‌టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు- ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది.

## అప్పటి వరకు శాంతి సాధ్యం కాదు

**కశ్మీర్, ఆగస్టు 4:** జమ్మూకశ్మీర్లో ఉగ్ర, వేర్పాటువాద కార్యకలాపాల విషయంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ల మధ్య సంబంధాలు మెరుగుపడేవరకు జమ్మూకశ్మీర్‌లో ఈ సమస్య పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. స్థానికంగా మిలిటెన్సీ అంతమైందనే వాదనలపై షోపియాన్ జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. 'జమ్మూకశ్మీర్లో మిలిటెన్సీ ఇంకా అంతం కాలేదు. కాబోదు కూడా. పొరుగుదేశంతో సంబంధాలు మెరుగుపడేవరకు దీనికి పరిష్కారం దొరకదు. స్థానికంగా ఉగ్రస్థావరాలను నిర్మూలించామని కేంద్రం గతంలో ప్రకటించింది. మరి అటువంటప్పుడు ప్రస్తుతం కుల్గాం ఎన్కౌంటర్ ఎందుకు జరుగుతోంది? ఇటువంటి పరిస్థితుల్లో ఈ సమస్య లేదని ఎలా చెప్పగలరు?'' అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. మిలిటెన్సీ ముగిసిందని తానెప్పుడూ చెప్పలేదన్నారు. జమ్మూకశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దుకు మంగళవారంతో ఆరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర హోదా ఎప్పుడు పునరుద్ధరిస్తారంటూ కేంద్రాన్ని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు.

# లిక్కర్ స్కాంపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తీవ్ర ఆరోపణ

- **లిక్కర్ స్కాం ను ఈడీకి అప్పగించాలి... తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి**

**తిరుచానూరు, ఆగస్టు 04,మనం న్యూస్ :** లిక్కర్ స్కాంపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తీవ్ర ఆరోపణలు చేశారు.తిరుపతి రూరల్ టీడీపీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన,లిక్కర్ స్కాం కేసును ఈడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. చెవిరెడ్డి వెనుక వెంకటేశ్ నాయుడు లాంటి వ్యక్తులు చాలా మందే ఉన్నారని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో జగన్ పాత్ర ఎంతైతే ఉందో, చెవిరెడ్డి పాత్ర అంతకన్నా ఎక్కువగా ఉందని ఆరోపించారు. బయటపడింది రూ.11 కోట్లు మాత్రమేనని, బయటపడకుండా దాగి ఉన్నది వందల కోట్లు కావచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. మద్యం కుంభకోణంలో తనకు సంబంధం లేదంటూ వైసీపీ నేత చెవిరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని ఆరోపించారు. చెవిరెడ్డి రోజుకో అబద్ధం చెబుతున్నాడు. కోర్టులో ఏడ్చేవాడే, బయట అధికారులను బెదిరించే స్థితికి వచ్చాడు. ప్రజలెప్పుడో గమనించేశారు... ఇప్పుడు విశ్వసించడం లేదని మండిపడ్డారు. చెవిరెడ్డి నటన ప్రజల్ని బలికావడం లేదని, తాను ఎన్నికలకే ముందు చెవిరెడ్డి తుమ్మలగుంటకు అపరిచితుడని



చెప్పానని గుర్తు చేశారు. సూత్రధారులు రాజ్ కసిరెడ్డి, వెంకటేష్ నాయుడు వంటి వారితో కలిసి విదేశీ పర్యటనలు ఎందుకు చేయాల్సి వచ్చిందో చెవిరెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దుబాయ్, శ్రీలంక, సింగపూర్ లాంటి దేశాల్లో నకిలీ డబ్బు మార్పిడి జరిగిన ఆధారాలు సిట్ అధికారులకు ఇప్పటికే దొరికాయిని ఇది జగన్, చెవిరెడ్డి ముఠా స్కామ్ అని విమర్శించారు.

తుడాలో చెవిరెడ్డి కుటుంబ సభ్యులు చేసిన అవినీతి, ల్యాండ్ డీలింగ్లు త్వరలో విజిలెన్స్ దర్యాప్తులో బహిర్గతం కానున్నాయని చెప్పారు. ఎన్నికల ముందు చంద్రగిరిలో దొంగ ఓట్లపై ఫిర్యాదులు చేశాం. కానీ వైసీపీ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఓట్లను చేర్పించింది. ఇప్పుడు ఆ ఫిర్యాదులన్నీ నిజమని తేలుతున్నాయి. దీనికి సహకరించిన అధికారులు ఊచలు లెక్కపెట్టాల్సిందేనని హెచ్చరించారు. టిటిడి వ్యవహారంలో ఇప్పటికీ వైసీపీ అధికారుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని, కల్తీ నెయ్యి వ్యవహారంలో చెవిరెడ్డి పాత్రపై కూడా అనుమానం ఉందని స్పష్టం చేశారు.తుమ్మలగుంట దేవాలయంలో జరిగిన అవినీతి పై ప్రభుత్వం స్పందించాలన్నారు.

దేవాలయాన్ని ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రికి త్వరలో లేఖ రాస్తానని పేర్కొన్నారు.ఇది మేము చేస్తున్న ఆరోపణలు కావు. ఇది సిట్ విచారణలో బయటపడుతున్న వాస్తవం.సీబీఐకి కేసు వెళ్తే మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయిని అన్నారు. ఎన్నికల ముందు తన ఫోను,కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మల్లంగుంట సింగిల్ విండో ఛైర్మన్ మధు శేఖర్,టీడీపీ నాయకులు వేమూరు మధు, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, గణపతి నాయుడు, కురకాల్వ సుధాకర్, ముని శేఖర్, సర్పంచ్ లు ప్రదీప్ కుమార్ రెడ్డి, పిపాసి, పేరూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



**తిరుమల,ఆగస్టు 04,మనం న్యూస్ :** శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలకు సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. ముందుగా సాయంత్రం సేనాధిపతివారిని ఆలయ మాడవీధుల గుండా ఊరేగింపుగా వసంతమండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఆ తరువాత ఆలయంలోని పవిత్ర మండపంలో అంకురార్పణ వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో ఆగస్టు 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. అంకురార్పణ కారణంగా సోమవారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.

ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది.

# తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మంత్రి పార్థసారథి



**తిరుమల, ఆగస్టు 04,మనం న్యూస్ :** సోమవారం ఉదయం గృహ నిర్మాణ శాఖ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ సమేతంగా తిరుమల స్వామివారిని దర్శించుకున్నారు.స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంత్రివర్యులు మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో వర్షపాతం నమోదైనందున రిజర్వాయర్లన్నీ నిండి నీళ్లతో కళకళలాడుతున్నాయని, అలాగే రైతులు కూడా వ్యవసాయం పాడి పాడిపంటలు బాగుండాలని భగవంతున్ని ప్రార్థించానని అన్నారు.అలాగే ముఖ్యమంత్రి ఆలోచన దృష్ట్యా 2047 విజన్ ఏదైతే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా రాష్ట్రంలోని యువత అందరూ అభివృద్ధి చెందాలనే దిశగా తపిస్తున్నారని ఆయన కల నెరవేరాలని భగవంతున్ని ప్రార్థించానని అన్నారు. అదే కాకుండా రాష్ట్రంలో ఎక్కడా కూడా విద్వేషాలు ప్రబలకుండా, ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా అటువంటి ప్రయత్నాలను భగవంతుడు అణగదొక్కే ప్రయత్నం చేయాలని ప్రజలందరూ వారి వారి కుటుంబాలలో శాంతియుత జీవనం గడపాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకున్నానని అన్నారు.

# రైతులకు అండగా వైయస్ఆర్సీపీ-జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి

- **రైతులకు ఎరువుల కోతపై కలెక్టర్‌కు వినతిపత్రం**

**తిరుపతి టౌన్,ఆగస్ట్ 04,మనం న్యూస్ :** వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి మరియు నియోజకవర్గ సమన్వయకర్తలు మరియు వైస్సార్సీపీ నాయకులు జిల్లాలో రైతులకు జరుగుతున్న ఎరువుల కోతలపై డిఆర్ఓ నరసింహులుకి వినతపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చేదేంది 13500 రూపాయలు తాను అధికారంలోకి వస్తే 20 వేల రూపాయలు 2024 జూన్ నెల నుంచి అందజేస్తారని చంద్రబాబు నాయుడు ఎన్నికల సభల్లో ప్రచారం చేసి ప్రజల దగ్గర ఓట్లు దండుకున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరం మూడు నెలలు అయిన తరువాత ఇప్పుడు కేవలం 5000 రూపాయలు ఇచ్చి అందులోనూ 7 లక్షల మందికి కోత విధించి , రైతు బాంధవుడు అని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు అని ఎద్దేవ చేశారు. ఇప్పుడు రైతులకు యూరియా లభించక క్యూలలో వేచి ఉండక అతలాకుతలమవుతున్నారని భూమన తెలిపారు. బ్లాక్ లో కొనడానికి ఒక బస్తా మీద 100 రూపాయలు 200 రూపాయలు పెచ్చుగా కొనుక్కుంటే తప్ప యూరియా దొరికే పరిస్థితి లేదు అన్నారు భూమన. జగన్మోహన్ రెడ్డి గారేమో ఆయన హయాంలో 13 లక్షల టన్నుల యూరియా కాంప్లెక్స్ ఎరువుల అందుబాటులో ఉంచి రైతులకు సమస్య లేకుండా చేస్తే చంద్రబాబు నాయుడు గారు రైతులకు ఇవ్వాల్సినటువంటి ఈ



యూరియా విషయంలో రెండు లక్షల టన్నుల స్టాకు ముందస్తుగా ఎప్పుడూ ఉంచుకోవాల్సిన ప్రభుత్వం 100 కోట్లు కేటాయించాల్సిన స్థానంలో 40 కోట్లు మాత్రమే బడ్జెట్లో కేటాయించడం వలనే యూరియా అందక రైతులకు ఇబ్బంది పడుతున్నారు అని భూముల కరుణాకర్ రెడ్డి తెలిపారు .నిరంతరం రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు ,విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడంతో నడివీధులలో అన్నమో రామచంద్రా అని అని ఏడుచుకునే పరిస్థితికి రైతుని చంద్రబాబు నాయుడు గారు తీసుకొచ్చారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నారాయణస్వామి, శ్రీకాళహస్తి ఇంఛార్జ్ బియ్యపు మధుసూదన్ రెడ్డి, సత్యవేడు ఇంఛార్జ్ రాజేష్ , ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశి, వైస్సార్సీపీ నాయకులు వున్నారు..

# తిరుమల కొండపై దోపిడీ దొంగలు

- **పోలీస్ తనిఖీల సమయంలోనే ఓ వ్యాపారి ఇంట్లో దొంగతనం**

తిరుమల,ఆగస్ట్ 04,మనం న్యూస్ : తిరుమలలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు.. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలోనే ఓ వ్యాపారి ఇంట్లో దొంగతనం చేసిన దుండగులు ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

ఏరియా డామినేషన్ లో భాగంగా 30 మంది సిబ్బందితో తిరుమల బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు పోలీసులు. అదే సమయంలో దోపిడీ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతూ దొంగతనం చేశారు. తిరుమలలో స్థానికులు నివాసం ఉండే డీ టైపు క్వాటర్స్ 27వ నంబర్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు దొంగలు.

మహేంద్ర అనే వ్యాపారి తిరుమలలో వ్యాపారం చేసుకొని రాత్రి ఇంటికి వచ్చే సమయానికి గేట్లు బద్దలు కొట్టుండడంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు పోలీసులు. పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో చోరీ జరిగిందా లేక తనిఖీల తర్వాత జరిగిందా అన్నది



తెలియాలి. ఒక పక్క తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలోనే చోరీ జరగడం పోలీసులకు సవాల్ గా మారింది. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న తిరుమల పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దుండగుల కోసం గాలిస్తున్నారు.

# మహిళలకు విద్య కల్పించడమే వివేకానందుడి లక్ష్యం



**తిరుపతి,ఆగస్టు 04, మనం న్యూస్ :** స్వామి వివేకానంద 39ఏళ్లు జీవించినా, కొన్ని తరాలకు సరిపడా స్ఫూర్తిని ఇచ్చారని కర్నాటక అకాడెమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఎస్వీయూ వైస్ చాన్స్ లర్, స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బి. వెంగమ్మ తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవంలో రెండవ రోజు మహిళలు యువజన సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు విద్య కల్పించడమే వివేకానందుడి లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని పిలుపు నిచ్చారు.

లక్ష్యాలను సాధించడానికి ఆత్మవిశ్వాసం ముఖ్యమని అన్నారు. దీనికి పుస్తకాలు ఉండవని, కానీ మనలోనే ఆత్మవిశ్వాసం కలుగజేసుకోవాలని తెలిపారు.నేటి మహిళల జీవన విధానం సమతుల్యంగా సాగాలంటే ఆత్మ విశ్వాసం అవసరమని అన్నారు. మీలో ఆత్మనిర్భరం కలిగి ఉంటేనే ఆత్మ విశ్వాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మనస్సును పాజిటివ్ ఆలోచనలకు అలవాటు చేయాలని తెలిపారు. మనకు తగిన లక్ష్యాలను ఎంపిక చేసుకుని సాధించాలని, అలవు కాని లక్ష్యాలను ఎంపిక చేసుకోవద్దని అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం చెప్పినట్టు వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ రాణి సదా శివ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందని అన్నారు. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తిలు మహిళలు కలిగి ఉండాలని తెలిపారు. డాక్టర్ వెంగమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఇంకా వేదకాలం వెలుగులో స్త్రీల ఆత్మ విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అనే అంశంపై ప్రసంగించారు.

ఇంకా నెల్లూరు రామకృష్ణ మిషన్ కార్యదర్శి హృదానందజీ మహరాజ్, రుయా హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. నిర్మల, రామకృష్ణ మిషన్ విజయవాడ సహాయ కార్యదర్శి శితికంఠానందజీ మహరాజ్ లు ప్రసంగించారు. ఈ కార్యక్రమానకి రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి సుకృతానందజీ మహరాజ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్లో ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతల వినతి

- **రైళ్లలో, ఏసీ బస్సుల్లో రాయితీ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలి**

**తిరుపతి,ఆగస్టు 04, మనం న్యూస్ :** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర , జిల్లా నాయకులు గోపి, శ్రీధర్, తులసీరామ్, జయ కుమార్ శ్రీనివాసులు, వాణి జిల్లా రెవెన్యూ అధికారి నర్సింహులకు వినతి పత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్లో మీకోసం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్లో వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సమర్పించారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించాలని, నిరుపేద,



మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే జర్నలిస్టు వృత్తిలో ఉన్నందున అందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, హెల్త్కార్డులు, ఆరోగ్య బీమా అందించాలని, మీడియ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టులకు సంబంధించిన అన్ని కమిటీలను పునరుద్ధరించాలని ఈ కమిటీలలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏలకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీని, గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికబీమా జర్నలిస్టులకు వర్తింపజేయాలని కోరారు. రైళ్లలో రాయితీ కొనసాగించాలని, ఏసీ బస్సుల్లో రాయితీ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సమాచారశాఖకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్వగృహానికి విచ్చేసిన మంత్రి సత్య కుమార్

**తిరుపతి,ఆగస్టు 04,మనం న్యూస్ :** తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదివారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి స్వగృహానికి విచ్చేశారు. మంత్రిని తుడా చైర్మన్ ఘనంగా ఆహ్వానించారు. మధ్యాహ్నం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఏర్పాటుచేసిన ఆతిథ్యాన్ని మంత్రి సత్యకుమార్ ఇతర నాయకులతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా బిజెపి, తెలుగుదేశం పార్టీ నాయకులతో భోజన సమయంలో మాటమంతి కలిపారు మంత్రి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు చాలా సానుకూలంగా ఉన్నారని వారి నమ్మకాన్ని కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా



తీసుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులు కష్టపడుతున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ సత్య కుమార్ యాదవ్ అన్న సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర మంత్రి స్థాయి వరకు ఎదిగారని గుర్తు చేశారు. అన్న మంత్రి అయ్యాక కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపరచడం, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి చేస్తున్న కృషి హర్షనియమని కొనియాడారు.

# టిటిడికి ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందించిన భక్తులు

**తిరుమల,ఆగస్టు 04,మనం న్యూస్ :** విజయవాడకు చెందిన క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ ఎండిలు శ్రీనివాస్ మరియు చక్రవర్తి సోమవారం రూ.1.05 లక్షల విలువైన ఒక బిజినెస్ ఎక్స్ పి ఎలక్ట్రిక్ స్కూటర్ ను టిటిడికి విరాళంగా అందించారు.

తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట ఈ స్కూటర్ కు పూజలు నిర్వహించి టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరికి దాతలు స్కూటర్ తాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖ తమిళ సినీ నటుడు సూర్య

**తిరుమల,ఆగస్టు 04,మనం న్యూస్ :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం ప్రముఖ తమిళ సినీ నటుడు సూర్య వారి సతీమణి జ్యోతిక



మరియు పిల్లలతో కలసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూ లైన్ ద్వారా ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్శనం అనంతరం ఆలయం వెలుపల సినీ నటుడు సూర్యని చూసేందుకు అతనితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపడంతో ఆలయం పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం ఏర్పడింది.

## దేవుని భూమిలో ?!

మరణించే జీవులను ఖననం చేయడానికి
కాసింత నేలకోసం వెతుకుతుంటాం కదా
మరీ ఆ నేలనే మరణిస్తుంటే
మాట్లాడకుండా ఉంటారెం?

రోగాలు మనషులకే కాదు
ఆలోచనలకూ ఉంటాయి...
తాకితే సోకే అంటువ్యాధులకు మందున్నట్టే
మాటలతో పాకే విద్వేషపు రోగాలకు
మందుకనిపెడ్తే బాగుండు!

పిల్లలొస్తే వాళ్ళ కడుపునింపాలని
చూసే తల్లుల రొమ్ములు
పాలకోసం ఏడ్చి ఏడ్చి ఎండిన పెదాలు
పక్కపక్కనే పడి ఉన్న పిల్లల
పెదాలు, తల్లుల రొమ్ములు

దేవుడు,పవిత్ర క్షేత్రం
అంతా పాలకుల కట్టుకథలు
యుద్ధం మిగిల్చిన మరుభూమే సాక్ష్యం
దేవుని భూమిలో శవాల కుప్పలు,బూడిద
దిబ్బలే ఆనవాళ్ళు
అఐ తో ముప్పని మొరిగే మనుషుల్లారా!
మారణహోమం జరుగుతున్న స్పందించని
మీతోనే ముప్పు
రోబోలకన్నా మానవత్వం సచ్చిన మనుషులే
ప్రమాదకారులు!!

**- దిలీప్. వి**
8464030808

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**– ఎడిటర్**

# మోడీ... ఆరెస్సెస్ మధ్య అంతరం పెరుగుతోందా?



బీజేపీ- ఆర్ఎస్ఎస్ అనుబంధం భారత రాజకీయంలో అత్యంత ఆసక్తికరమైన, శక్తివంత మైన సంబంధాల్లో ఒకటి. జనసంఘం కాలం నాటికే ఆరంభమైన ఈ అనుబంధం, భారతీయ జనతా పార్టీ స్థాపన తర్వాత మరింత బల పడింది. ఆరెస్సెస్లో సేద్యం చేసిన కర్షకులు, పౌర అభ్యుదయమే లక్ష్యంగా భావించే స్వయం సేవకులు, బీజేపీలో కీలక స్థానాల్లోకి వచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నుంచి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఆర్ఎస్ఎస్ ప్రభావం స్పష్టంగా కనిపించేది. కానీ, నరేంద్ర మోదీ మూడవ సారి ప్రధానిగా పదవిలోకి వచ్చిన తర్వాత ఆయన పాలనా శైలి, ఆరెస్సెస్ భావజాలం మధ్య తేడాలు కనబడు తున్నాయని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఆర్ఎస్ఎస్, సిద్ధాంతపరంగా నూతన భారత నిర్మాణంలో 'సంస్కార' ప్రాతిపదికగా సామాజిక మార్పు, హిందుత్వ విలువల ప్రచారం ద్వారా జాతి నిర్మాణాన్ని కోరుతుంది. కానీ మోదీ పాలన నిత్య రాజకీయ దృష్టితో ముందుకు సాగుతున్నది. ఆయన నూతన భారత నిర్మాణంలో సామాజిక పరిమాణాల కన్నా రాజకీయ విజయమే ప్రధాన లక్ష్యంగా మారింది. ముఖ్యంగా ప్రజల మద్దతుతో కూడిన శక్తిమంతమైన నరేంద్ర మోదీ బ్రాండ్ నిర్మాణం, నిత్యం ఎన్నికల మూడ్, మెగా స్కీమ్‌లు, హిందూ ఓటు బ్యాంకు సమీకరణం వంటి అంశాలు గణనీయంగా మారాయి. ఈ క్రమంలో బీజేపీ కార్యనిర్వాహక నియంత్రణ ఆర్ఎస్ఎస్ చేతిలో ఉండకుండా, ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ కేంద్రీకృతమవుతోంది. నరేంద్ర మోదీ నియామకాలు, భవిష్యత్ రాజకీయ వారసత్వంపై తనదైన శైలి ప్రవేశ పెడుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి.

ఇటీవలి మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ కేబినెట్ ఎంపికలో ఆర్ఎస్ఎస్ సూచనలు పూర్తిగా ప్రతిఫలించలేదనే విమర్శలు ఉన్నాయి. విశేషంగా, మురళీధర్ రావు, సంజయ్ మయుఖ్ వంటి స్వయం సేవకుల అభ్యర్థిత్వం పక్కన పెట్టడమే కాక, సంస్కృతి, విద్య, సమాజ సేవ రంగాలకే చెందిన వారికీ తక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాక, బిఎల్ సంతోష్ వంటి సంఘ ప్రచారకులు ఇప్పటికే పార్టీ పొలిటికల్ కంట్రోల్ నుంచి పక్కకు నెట్టబడ్డారని వాదనలు వచ్చాయి. దీంతో, ఆర్ఎస్ఎస్ మౌనం తప్ప మరో ప్రకటన చేయలేదు.

**మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోదీ కేబినెట్ ఎంపికలో ఆర్ఎస్ఎస్ సూచనలు పూర్తిగా ప్రతిఫలించలేదనే విమర్శలు ఉన్నాయి. విశేషంగా, మురళీధర్ రావు, సంజయ్ మయుఖ్ వంటి స్వయం సేవకుల అభ్యర్థిత్వం పక్కన పెట్టడమే కాక, సంస్కృతి, విద్య, సమాజ సేవ రంగాలకే చెందిన వారికీ తక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలుస్తోంది.**
**బీజేపీ - ఆర్ఎస్ఎస్ బంధం అనుబంధంగా పుట్టినదే. కానీ మోదీ బ్రాండ్ అధికంగా మూర్తిమత్వం చెందుతున్న ఈ కాలంలో ఆ అనుబంధం క్రమంగా బలహీన పడుతున్నదని విశ్లేషకుల భావన. భావజాలం ఒకటే అయినా, దానిని ఆచరణలోకి తీసుకు రావడంలో మోదీ దారిలో ఆరెస్సెస్ నడవటం కష్టమవుతోంది. ఇది భారత రాజకీయాల్లో ఓ మౌలిక మార్పుగా పరిగణించ వచ్చు.**

ఇక ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలపై కేంద్రం దృష్టి మరిచిందని విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్కృత భాషా అభివృద్ధి, ధర్మాచార్య వ్యవస్థకు ప్రోత్సాహం, ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యా సంస్థలకు నిధుల అనుకూలత వంటి రంగాల్లో మోదీ హయాంలో అనేక ఆశలున్నప్పటికీ, వాటి అమలులో చురుకుదనం తగ్గిందని సంఘ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాక, నూతన విద్యా విధానం, యూనిఫాం సివిల్ కోడ్, జనాభా నియంత్రణపై చట్టాలు వంటి హిందుత్వ సంబంధిత ముఖ్య రంగాల్లో తక్షణ చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరగడంతో, ఆరెస్సెస్‌లో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయం వ్యాపక మవుతోంది.

ఈ నేపథ్యంలో, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల పదే పదే చేస్తున్న వ్యాఖ్యలు గమనించదగ్గవే. రాజకీయ నాయకులు వయసు 75 దాటిన తరువాత పదవులు వదిలి పోవాలని, తద్వారా యువతకు అవకాశం కల్పించ బడాలని ప్రకటించారు. ప్రధాని మోదీ కూడా 75కి చేరుతున్నందువల్ల, ఇది ప్రత్యక్ష సంకేతమా అనేదీ విమర్శలు ఉన్నాయి.

ఆయన్ని స్వయంగా మోదీ కలవక పోవడం, బీజేపీ అగ్రనేతలు కోపతాపాలకు లోనై, స్పందించక పోవడం అన్నీ రాజకీయ విశ్లేషకుల దృష్టికి వచ్చాయి. 'ఆసక్తికరమైన సమాజం కోసం రాజకీయాలు మారాలి', 'దేశ భవిష్యత్ కోసం మత సామరస్యమే మార్గం', 'నిర్బంధం కాదు, నైతికతే ముఖ్యమని' భాగవత్ పలుమార్లు చెప్పడం ద్వారా మోదీ పాలనను వ్యంగ్యంగా విమర్శించినట్టు భావన కలుగుతోంది. మోదీ కేంద్రీకృత పాలన విధానం, మంత్రివర్గ వ్యవహార శైలి, ఆయా రాష్ట్రాల బీజేపీ ముఖ్యమంత్రుల ఎంపికలో ఆర్ఎస్ఎస్ పాత్ర తగ్గిపోవడం వంటి అంశాలు ఈ విభేదాంతరాన్ని మరింత స్పష్టంగా చేస్తున్నాయి.

అయితే ఇది పూర్తిగా విభేదం కాదు. మోదీ-ఆర్ఎస్ఎస్ మధ్య సంబంధం మౌలికంగా ఒకే భావజాలపు పునాది మీద నడుస్తున్నా, దాని కార్యరూపాలు, ప్రామాణికతల్లో తేడాలు రావడం సహజం.

ప్రధానిగా మోదీ రాజకీయ అవసరాల దృష్టితో నిర్ణయాలు తీసుకుంటే, ఆర్ఎస్ఎస్ దాన్ని ధర్మ, సంస్కృతి, సంయమనం అనే పరిమాణాలతో పరిశీలిస్తుంది. అందువల్ల, ఈ అంతరం వాస్తవమే అయినా, అది శాశ్వత శత్రుత్వానికి దారితీయదని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

భాజపా - ఆర్ఎస్ఎస్ బంధం అనుబంధంగా పుట్టినదే. కానీ మోదీ బ్రాండ్ అధికంగా మూర్తిమత్వం చెందుతున్న ఈ కాలంలో ఆ అనుబంధం క్రమంగా బలహీన పడుతున్నదని విశ్లేషకుల భావన. భావజాలం ఒకటే అయినా, దానిని ఆచరణలోకి తీసుకు రావడంలో మోదీ దారిలో ఆరెస్సెస్ నడవటం కష్టమవుతోంది. ఇది భారత రాజకీయాల్లో ఓ మౌలిక మార్పుగా పరిగణించ వచ్చు. మోదీ తర్వాత బీజేపీ - సంఘ పరస్పర సంబంధాలు ఎటు పోతాయన్నది ఆసక్తికరమైన ప్రశ్నగా నిలుస్తోంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# అమెరికా ప్రతిష్టను మసకబార్చుతున్న 'ట్రంప్ టారీఫ్ వార్'



అమెరికా డోనాల్డ్‌ట్రంప్ ఆధిపత్య ఆరాటంతో దాదాపు 70 దేశాల దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తున్నట్లు రోజుకో ప్రకటన చేస్తూ, మతి భ్రమించినట్లు అవాకులు చెవాకులు విసురుతున్నారు. అమెరికా చేపట్టే ప్రతి చర్య తన స్వార్థపూరిత ధోరణిని రుజువు చేస్తున్నది. మా ఇంటికి వస్తే ఏం తెస్తావు, మీ ఇంటికి వస్తే ఏం పెడతావు అన్న చందంగా ఉన్నది నేటి అమెరికా డొనాల్ ట్రంప్ ప్రవర్తన. ఇతర దేశాల నుంచి జరిగే దిగుమతులకు ఆ దేశం విధించే పన్నులను టారీఫ్స్ లేదా సుంకాలుగా పేర్కొంటారు. విదేశీ వస్తువులు అమెరికాలో ప్రవేశించడానికి ఆ దేశం విధించే పన్నుల శాతాన్ని బట్టి ఇరుదేశాల మధ్య వస్తు వాణిజ్యాలు జరుగుతాయి. ఒక దేశ దిగుమతులపై 10 శాతం పన్ను విధించిన సందర్భంలో ప్రతి 10డాలర్లకు 1 డాలర్ పన్నును దిగుమతి చేసుకున్న కంపెనీ లేదా సంస్థ కట్టాల్సి ఉండడంతో ఆ వస్తువుకు ధర 11 డాలర్లుగా నిర్ణయించడం జరుగుతుంది.

**నిస్సహాయంగా నిలుస్తున్న ఐరాస, డబ్ల్యూటిఓ**

డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి ఆయన మాటలు, కదలికలు, నిర్ణయాలు తీవ్ర సంచనాలుగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉంటున్నాయి. నేడు అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధం లేదా టారీఫ్ వార్ ప్రారంభం ఒక అమెరికా విమోచన దినం లేదా లిబరేషన్ డే అంటూ 100 రోజుల ట్రంప్ పాలన సందర్భంగా ఏవేవో ప్రకటనలు చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ లేదా వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటిఓ)ను నామమాత్రపు సంస్థగా కొట్టి పారేస్తూ, అంతర్జాతీయంగా పరువు తీసుకుంటున్నారు. ప్రపంచ వాణిజ్య అడ్డంకులను అధిగమిస్తూ ఎగుమతులు-దిగుమతులకు ఊతం ఇస్తూ, సుస్థిర అంతర్జాత వాణిజ్య విపణి స్వేచ్ఛను పరిరక్షించాలనే సదుద్దేశంతో 1995లో వరల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయబడింది. ఇటీవల జెనీవాలో జరిగిన డబ్యూటిఓ 30వ సమావేశం జరగడం, అంతర్జాతీయ వాణిజ్య అంశా లను చర్చించడం జరిగిన విషయం మనకు తెలుసు. డబ్ల్యూటిఓ సంస్థ చైనా పక్షపాతిగా పని చేస్తున్నదని ట్రంప్ మాట్లాడుతున్నారు. నేడు కొనసాగుతున్న ఇజ్రాయిల్-గాజా యుద్ధం, ఉక్రెయిన్-రష్యా భీకర పోరాటం నేపథ్యంలో ఐక్యరాజ్యసమితితో పాటు ప్రపంచ వాణిజ్య సంస్థ కూడా నామమాత్రంగా, క్రియా శీలత కొరవడిన పేపర్ టైగర్స్ వలె నిస్సహాయంగా నిలుస్తున్నాయి.

**విమర్శలకు దారితీస్తున్న ట్రంప్ సుంకాలు**

అమెరికా డిక్షనరీలో అత్యంత ఇష్టమైన పదం సుంకం లేదా టారీఫ్ అంటున్నారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. పలు దేశాల దిగుమతులపై 10 శాతం సుంకాలు విధించడమే కాకుండా ఇండియా లాంటి దేశాలపై రెసిప్రోకల్ టారీఫ్ లేదా పరస్పర సహకార సుంకాలు విధిస్తున్నది. రష్యా నుంచి రక్షణ సామాగ్రి, ముడి చమురులతో పాటు ఇతర దిగుమతులు చేసుకోవడాన్ని ఆపి వేయాలని అమెరికా ఇండియాకు సూచిస్తూ, వినని యెడల రిసిప్రోకల్ టారీఫ్స్ విధిస్తామని బెదిరిస్తున్నారు. అమెరికాను సంపన్న దేశంగా తిరిగి నిలుపుతా అంటూ వివిధ దేశాలపై సుంకాల కత్తులు దూస్తున్నారు.

తాజాగా ఇండియా దిగుమ తులపై 25 శాతం రెసిప్రోకల్ టారీఫ్ విధించినట్లు ట్రంప్ ప్రకటన చేయడంతో పాటు పాకిస్థాన్ దిగుమతులపై గతంలో విధించిన 29 శాతం సుంకాన్ని 19 శాతం వరకు తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఇదే సందర్భంగా 01 ఆగస్టు 2025 నుంచి హాటెస్ట్ కంట్రీలు అయిన కెనడాపై 35 శాతం, బ్రెజిల్ 50 శాతం, స్విట్జర్లాండ్‌పై 39 శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు.



ట్రంపునకు ఇష్టమైన నినాదంగా సుంకాలతో అమెరికాను అత్యున్నత, సంపన్న దేశంగా నిలుపుతానంటూ ప్రకటనలు కుమ్మరిస్తున్నారు. ఇతర దేశాల రక్తాన్ని పీల్చి తాను సంపన్న దేశంగా నిలవాలని అమెరికా కలలు కంటున్నది. అగ్రరాజ్యం పోకడలు అడుక్కుతినే బిచ్చగాళ్ల వలె, సుంకాల హెచ్చరికల రూపంలో దేశాలను తన ఆదీనంలోకి తెచ్చుకునే చావు తెలివిని ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తున్నది. తాను చేస్తున్న సుంకాల యుద్ధంతో అమెరికాలో ఉత్పత్తుల పెరుగుదల, ఉద్యోగ కల్పన, వాణిజ్య లోటు భర్తీ, పెట్టుబడులు పెంచుకోవడానికి ఉపయుక్తంగా ఉంటాయంటా ట్రంప్ అతి గర్వంగా ప్రకటనలు కుమ్మరిస్తున్నారు. సంపన్న అగ్రరాజ్యంగా అమెరికా నిత్యం స్వార్థమే పరమావధిగా పావులు కదపడం కొత్తేమీ కాదు. అమెరికా తీసుకునే ప్రతి నిర్ణయం తనకు విజయాన్ని, పరాయి దేశానికి నష్టాన్ని కలిగించే విధంగా విన్-లూజ్ (యూఎస్ విజయం - పొరుగు దేశ అపజయం) మంత్రాన్ని జపిస్తున్నది. ఒక అగ్రరాజ్యంగా లోక కళ్యాణానికి ఉపయుక్తంగా విన్-విన్ (అమెరికాకులాభం- పొరుగు దేశానికి లాభం)పరిస్థితులను కల్పించాల్సి ఉన్న తరుణంలో విన్ - లూజ్ నిర్ణయాలను అతి తెలివిగా ప్రయోగిస్తున్నది.

**అసమ్మతిని మూట కట్టుకున్న ట్రంప్**

అమెరికా నేడు అన్ని దేశాలను వినియోగదారుడిగా వ్యాపార దృష్టితో చూస్తున్నది. తన ప్రయోజనాలే ఊపిరిగా, అల్పాదాయ దేశాల నుంచి సహితం లాభం పొందడానికి సిద్ధంగా ఉన్నది. ప్రపంచ దేశాల నుంచి రక్తాన్ని పీల్చే జలగ వలె అమెరికా అవతరించింది. అంతర్జాతీయ విపణిలో చులకనై పోతున్నది. మానవత్వాన్ని, ప్రపంచ శాంతిని మరిచి తన లాభమే బ్రహ్మసూత్రంగా పావులు కదుపుతున్నది. ట్రంప్ ప్రకటించిన సుంకాల అస్త్రం తనకే కీడును చేయనుందని కూడా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన ప్రపంచ ప్రజాదరణ కలిగిన నాయకుల జాబితాలో ట్రంప్ 8వ స్థానంలో నిలుస్తూ, 50 శాతం ప్రజల అసమ్మతిని మూటగట్టుకున్నారు. ఒకవేళ నేడు అమెరికాలో ఎన్నికలే జరిగితే ట్రంప్ ఓటమి ఖాయమని తెలుస్తున్నది. నేడు అమెరికా చేస్తున్న సుంకాల యుద్ధంతో ప్రపంచ దేశాలన్నీ వ్యతిరేకం కావడం, అమెరికాను ఏకాకిని చేయడం జరిగే అవకాశాలు కూడా లేకపోలేదని నమ్మే ప్రజల సంఖ్య పెరుగుతోంది.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## జ్వలించే నిరంతరస్ఫూర్తి...

అదిగో అక్కడ వెలుగులీనుతున్న అమరజ్యోతి
దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వీరత్వం
సైన్యమై శత్రువుల గుండెల్లో పేలిన మందుపాతర
ధైర్యం శౌర్యం వీరత్వం
మూర్తీభవించిన భారతీయం
తల్లిదండ్రులు భార్యాపిల్లలకి
పలికిన ఆఖరి వీడ్కోలు
స్వర్గరథం వెంట కదులుతున్న దుఃఖం, అర్ధాంగి
నాన్నెందుకు మాటాడడం లేదో ! అర్థంకాని
చిన్నారులు ..అందరి పరామర్శకి జవాబు
చెబుతున్న వేదన - తల్లిదండ్రులు
తోడుగా వీరునికి జన్మనిచ్చిన నేల,
వీరునికి పలుకుతున్న చివరి వీడ్కోలు...
బాధని గుండె దిగమింగుకుంటోంది.. కనులు
వర్షిస్తూనే వున్నాయి..'జోహార్' అంటూ
చల్లుతున్న పూలు.. కన్నీళ్లను తుడిచి
వేస్తున్నాయి.. 'అమర్ రహే' అంటూ నినదిస్తున్న
గొంతులు .. అందరి మనసులని
తడిపేస్తున్నాయి... అదిగో, జాతీయపతాకం
కప్పబడినచోట .. ఒక గెలుపుసంజ్ఞ ..
నింగికెగిసిన వెలుగు జ్వలించే నిరంతరస్ఫూర్తి...
ఈ నేల రుణం తీర్చుకున్న ఒక అంతులేని
తృప్తి... వీరుని త్యాగం జాతి గుండెల్లో నిలుచు
చిరస్థాయి.. అందరూ క్షేమమై నడయాడుతున్న
నేలపై .. ఆ త్యాగమూర్తి పాదముద్రలు
శాశ్వతం... అమరం...

**- అశోక్ గుంటుక**
9908144099

# పులుల సంరక్షణ : దేశం సాధించిన ప్రగతి!



ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద అత్యంత సురక్షితమైన పులుల ఆవాసాలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. గత కొన్ని దశాబ్దాలుగా మన దేశం సాధించిన పురోగతి నిజంగా అద్భుతం, ఇది ప్రపంచవ్యాప్తంగా సంరక్షకులకు ఆదర్శంగా నిలుస్తుంది. 2006లో కేవలం 1,411 పులులు మాత్రమే అడవులలో నివసిస్తున్నాయని అంచనా వేయగా, ఈ సంఖ్య 2010లో 1,706కు, 2014లో 2,226కు (30.5% పెరుగు దల), 2018లో 2,967కు గణనీయంగా పెరిగింది. అద్భుత మైన రీతిలో 2023 సం. నాటికి ఏకంగా 3,682 పులులతో భారతదేశం ప్రపంచ పులుల జనాభాలో దాదాపు 75 శాతాన్ని తనదైందని ప్రకటించింది. ఇది కేవలం సంఖ్యల పెరుగుదల మాత్రమే కాదు, దేశం పులుల సంరక్షణకు ఎంత అంకిత భావంతో, నిరంతరం శ్రమిస్తుందో తెలియజేస్తుంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు అటవీ ప్రాంతాలలో ట్రెక్కింగ్ చేస్తూ, అటవీ అధికారులు శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి ఈ జనాభా గణనను చేపడతారు. ఈ సుదీర్ఘమైన, సవాళ్లతో కూడుకున్న పనికి మనం అభినందనలు తెలపాలి. ఈ గణనలో పులుల పాదముద్రలు, అత్యాధునిక కెమెరాట్రాప్‌లు, డీఎన్ఏ విశ్లేషణ వంటి ఆధునిక పద్ధతులను సమర్థవంతంగా ఉప యోగిస్తారు, ఇది కచ్చితమైన అంచనాలకు దారితీస్తుంది. పులుల సంఖ్య పెరుగుదల మన పర్యావరణ వ్యవస్థల అద్భుతమైన ఆరోగ్యాన్ని సూచిస్తుంది. పులులు ఆహార గొలుసులో అత్యున్నత స్థానంలో ఉన్నందున అవి ఆరోగ్యకరమైన మరియు సమతుల్యమైన అటవీ పర్యావరణానికి సూచికలుగా పనిచేస్తాయి. వాటి సంఖ్య పెరగడం అంటే అడవులు పచ్చగా ఉన్నాయని, వాటి ఆహార వనరులు సమృద్ధిగా ఉన్నాయని, తద్వారా మొత్తం జీవవైవిధ్యం అభివృద్ధి చెందుతుందని అర్థం. ఇది పర్యావరణ సమతుల్యతకు, ప్రకృతికి ఎంతగానో దోహద పడుతుంది.

**ప్రాజెక్ట్ టైగర్- ఒక మహత్తర విజయం**

పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన ఈ ఘనతకు ప్రధాన కారణం నిస్సందేహంగా ప్రాజెక్ట్ టైగర్. పర్యావరణ, అటవీ వాతావరణ మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం పులుల సంరక్షణ బాధ్యతను పంచుకుంటున్న రాష్ట్రాలకు నిరంతరం కేంద్ర సహాయాన్ని అందిస్తుంది. 1973లో ప్రారంభమైన ప్రాజెక్ట్ టైగర్ కింద, పులుల ఆవాసాలను పరిరక్షించడానికి ప్రత్యేకమైన టైగర్ రిజర్వ్‌లను ఏర్పాటు చేశారు. వీటిని భారత ప్రభుత్వ జాతీయ పులుల సంరక్షణ అథారిటీ సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఈ రిజర్వ్‌లు జాతీయ ఉద్యానవనం లేదా వన్యప్రాణుల అభయారణ్యం వంటి ఇప్పటికే ఉన్న రక్షిత ప్రాంతాలలో భాగమైన కీలకమైన ప్రాంతాలను కలిగి ఉంటాయి. ఇవి పులులకు అత్యంత అనుకూలమైన ఆవాసాలను అందిస్తాయి.

ప్రారంభంలో కేవలం 9 టైగర్ రిజర్వ్‌లతో మొదలై, మార్చి 2024 నాటికి ఈ సంఖ్య 55కు చేరగా, 2025 నాటికి ఏకంగా 58 టైగర్ రిజర్వ్‌లు ఉన్నట్లు సమాచారం. వీటిలో మాధవ్ టైగర్ రిజర్వ్ తాజాది. ఈరిజర్వ్‌లు అంతరించి పోతున్న బెంగాల్ టైగర్ను దాని సహజ ఆవాసాలను రక్షించడానికి ప్రత్యేకంగా స్థాపించబడ్డాయి. ఇవి మన పులుల పరిధిలోని 18 రాష్ట్రాలలో విస్తరించి, మొత్తం 78,735.5966 చ.కి.మీ (దేశభౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 2.23%) విస్తీర్ణంలో పులులకు సురక్షితమైన ఆవాసాన్ని అందిస్తున్నాయి. ఈ టైగర్ రిజర్వ్‌లు కఠినమైన నిఘా, అధునాతన వేట నిరోధక చర్యలు, స్థానిక ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో పులులకు అభేద్యమైన రక్షణ కల్పిస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, తెలంగాణలో అమ్రాబాద్ (2,611.39 చ.కి.మీ), కవాల్ (2,015.44చ.కి.మీ) టైగర్ రిజర్వ్‌లు ఉండగా ఆంధ్ర ప్రదేశ్‌లో నాగార్జునసాగర్ శ్రీశైలం (3,296.31 చ.కి.మీ) టైగర్ రిజర్వ్ ఉంది. ఈ రిజర్వ్‌లు కేవలం పులులను మాత్రమే కాకుండా వాటి జీవవైవిధ్యాన్ని కూడా కాపాడుతున్నాయి. వివిధ రకాల వృక్ష, జంతు జాతులకు సురక్షితమైన ఆశ్రయం కల్పిస్తున్నాయి.

**పర్యావరణ పర్యాటకం - సంరక్షణకు ఒక వంతెన**

మన దేశంలోని పులుల సంరక్షణ కేంద్రాలలో పర్యావరణ పర్యాటకం ఒక ముఖ్యమైన నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోంది. పర్యావరణ అవగాహన లక్ష్యంతో బాధ్యతాయుతమైన పర్యాటక పద్ధతులను అవలంబిస్తూ జీవవైవిధ్య పరిరక్షణను ఇది సమన్వయం చేస్తుంది.



రణతంబోర్, జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ వంటి ప్రసిద్ధ పులుల సంరక్షణ కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రకృతి ఔత్సాహికులను, వన్యప్రాణుల ప్రేమికులను విరివిగా ఆకర్షిస్తున్నాయి. పర్యావరణ పర్యాటకం నుండి వచ్చే ఆదాయం సంరక్షణ ప్రయత్నాలకు గణనీయంగా దోహదపడుతుంది. దేశ పర్యావరణ సమతుల్యతలో జీవుల ప్రాముఖ్యతను బలోపేతం చేస్తుంది.

పర్యాటకం టైగర్ రిజర్వ్‌లలో గొప్ప జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలో బాధ్యతను, భాగస్వామ్య నిబద్ధతను పెంపొందిస్తుంది. పర్యాటకులు పులులను వాటి సహజ ఆవాసాలలో ప్రత్యక్షంగా చూడటం ద్వారా వాటి సంరక్షణకు ఉన్న ఆవశ్యకతను మరింత లోతుగా అర్థం చేసుకుంటారు. ఇది ప్రజలలో వన్యప్రాణుల పట్ల అవగాహన, ప్రేమను గణనీయంగా పెంచుతుంది. సహజ ఆవాసాలకు కనీస అంతరాయం కలగకుండా, హాని కలిగించే పులుల జనాభాను కాపాడేందుకు కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయి.

**ఉక్కుపాదం మోపాలి**

టైగర్ రిజర్వ్‌లకు వన్యప్రాణుల (రక్షణ) చట్టం 1972 ప్రకారం పటిష్టమైన చట్టపరమైన రక్షణ కల్పించబడింది. ఈ చట్టం అధికారులకు వేట, అక్రమ ఆక్రమణలు, రిజర్వ్ల వన్యప్రాణులు, పర్యావరణ వ్యవస్థను బెదిరించే ఇతర కార్యకలాపాలపై కఠినమైన చర్యలు తీసుకునే అధికారం ఇస్తుంది. ఈ చట్టం లోని సెక్షన్ 38 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పులుల సంరక్షణ ప్రణాళికను రూపొందించే అమలు చేసే బాధ్యతను కలిగి ఉంటాయి. జీవవైవిధ్యాన్ని కాపాడే క్రమంలో పులులను సంరక్షించుకోవడం మన కనీస ధర్మం. వీటిని వేటాడే వారిపై ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరించి ఉక్కుపాదాన్ని మోపాలి.పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన ఈ ప్రగతి మనందరికీ గర్వకారణం.

ఇది కేవలం పులుల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అటవీ సంపదను పరిరక్షించడం, మానవ-వన్యప్రాణుల సహజీవనాన్ని ప్రోత్సహించడం వంటి విస్తృత లక్ష్యాలను కలిగి ఉంది. భవిష్యత్తులో కూడా ఈ సంరక్షణ ప్రయత్నాలను నిరంతరం కొనసాగించి మన జాతీయ జంతువును భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

అంతర్జాతీయ పులుల దినో త్సవం సందర్భంగా, పులుల సంరక్షణలో మన దేశం సాధించిన అద్భుతమైన ప్రగతిని ప్రశంసించకుం డా ఉండలేం. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈ దినోత్సవం, పులుల సంరక్షణ ప్రాముఖ్యతను మనందరికీ గుర్తు చేస్తుంది. 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్ టైగర్ సమ్మిట్లో సమావేశమైన 13 పులుల జనాభా దేశాలు, 2022 నాటికి ప్రపంచ పులుల జనాభాను రెట్టింపు చేయాలనే మహత్తర లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశాయి. 2025 ఇతివృత్తం 'మానవులు, పులుల మధ్య సామరస్య సహజీవనం' అనేది, ఉమ్మడి పర్యావరణ వ్యవస్థలకు ప్రయోజనం చేకూర్చే సమగ్ర పరిరక్షణ ప్రయత్నాల ఆవశ్యకతను స్పష్టంగా నొక్కి చెబుతోంది. ఒకప్పుడు ఆసియా ఖండం అంతటా స్వేచ్ఛగా సంచరించిన పులులు, దురదృష్టవశాత్తు నేడు ఆవాసాల విధ్వంసం, అక్రమ వేట, మానవ-వన్యప్రాణుల మధ్య పెరుగుతున్న సంఘర్షణల కారణంగా గణనీయంగా తగ్గిపో యాయి. అయితే, ఈ క్లిష్టమైన పరిస్థితులలో, భారతదేశం ఒక ఆశాకిరణంగా, పులుల సంరక్షణకు ప్రపంచానికే ఒక మార్గదర్శిగా నిలుస్తోంది.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# మున్సిపాల్టీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యతనివ్వాలి

- స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కోసం స్వయంగా సీఎం అవగాహన
- పొంగూరు నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి






**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 04(మనం న్యూస్):** ఈ ఏడాది డిసెంబర్ చివరకల్లా రాష్ట్రాన్ని లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్ గా మారుస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిపోయిన చెత్తతో పాటు కొత్తగా వచ్చిన 20 లక్షల టన్నుల చెత్తను డిసెంబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు. రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు కమిషనర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు... స్వచ్ఛ నగరాల సాధన కోసం ప్రజల్లో కల్పించాల్సిన అవగాహనపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐఇసి , కెపాసిటీ బిల్డింగ్ పై రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను మంత్రి నారాయణ ప్రారంభించారు... అనంతరం మీడియాతో మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల కమిషనర్లు సాలిడ్ వేస్ట్,లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు...చెత్త రహిత నగరాలుగా మార్చేందుకు మున్సిపల్ కమిషనర్లు కీలక పాత్ర వహించాలన్నారు... స్వచ్ఛ భారత్ కింద స్వచ్ఛాంధ్ర సాధనకు అధికారులు, ప్రజలంతా కలిసి పనిచేయాలన్నారు... ప్రతి నెలా మూడో శనివారం సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు... ఏదో ఒక ప్రాంతంలో స్వయంగా పాల్గొంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు... స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వారి సహకారం కావాలన్నారు... కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్వచ్ఛతా నాలెడ్జ్ పార్టనర్స్ తో కలిసి మున్సిపల్ కమిషనర్లు చర్చించుకుని వాటిని కింది స్థాయిలో అమలుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు... రాష్ట్రంలోని 5 నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం గర్వకారణంగా ఉందన్నారు... అవార్డులు సొందిన మున్సిపాల్టీల అధికారులు, సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిపోయారన్నారు. ఈచెత్తనంతా వచ్చే అక్టోబర్ రెండో తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు.. మరోవైపు కొత్తగా వచ్చిన 20 లక్షల టన్నుల చెత్తను కూడా డిసెంబర్ నాటికి పూర్తిగా తొలగించి లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్ గా మారుస్తామన్నారు... రాష్ట్రంలోని ప్రతిరోజూ వచ్చే ఘన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లకు తరలిస్తున్నామన్నారు.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లతో పాటు కొత్తగా కడప, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతిలో కూడా ప్లాంట్ లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు... ఈ ప్లాంట్ లన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రం డంపింగ్ యార్డ్ రహితంగా మారుతుందన్నారు. అలాగే ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం సీవరేజి ట్రీట్ మెంట్ ప్లాంట్లు రెండేళ్లలో ఏర్పాటుచేస్తామన్నారు... అమృత్ పథకం నిధులతో డ్రింకింగ్ వాటర్ పైప్ లైన్లు పూర్తిచేస్తామని చెప్పారు... గత ప్రభుత్వ నిర్వాకంతో సింగపూర్ కు ఏపీకి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయన్నారు. 2014-19 మధ్య కాలంలో సింగపూర్ లోని మెజారిటీ షేర్ ఉన్న కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్నామన్నారు. గత ప్రభుత్వం ఆ అగ్రిమెంట్ ను రద్దు చేయడంతో పాటు సీఐడీ అధికారులను పంపి విచారణ జరిపించారని అన్నారు.. దీంతో ఆ ప్రభుత్వంతో ఏపీకి ఉన్న సంబంధాలు దెబ్బతాన్నాయన్నారు. తిరిగి ఆ సంబంధాలు పునరుద్దరించడానికే సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లారని అన్నారు... సింగపూర్ ప్రభుత్వాధికారులు ఎంతో పాజిటివ్ గా స్పందించారన్నారు. సింగపూర్ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు అంటే ఎంతో గౌరవం ఉందన్నారు.. .అయితే ప్రపంచ బ్యాంకుతో కలిసి అమరావతికి సహకారం అందించేందుకు సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు... అలాగే సింగపూర్ కంపెనీలను విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానించినట్లు తెలిపారు... తర్వాత సింగపూర్ ప్రభుత్వంతో సీఆర్డీఏ కమిషనర్ అధికారికంగా లెటర్ రాసిన తర్వాత సంప్రదింపులు చేస్తారని మంత్రి నారాయణ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ మున్సిపాల్టీల అభివృద్ధికి దేశం లో 3 అత్యుత్తమైన ఏజెన్సీలు గుర్తించి ఎంపిక చేశామన్నారు. 123 నగరాల్లో స్వచ్ఛత పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. స్వఛ్ఛ సర్వేక్షణ్ లో 5 అవార్డ్ లు రావడం మనకు గర్వకారణమన్నారు. రాష్ట్రం లో ఒక రీసైక్లింగ్ పార్క్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్తున్నామన్నారు. స్వచ్ఛ సేవలో నిధులు కొరత లేకుండా కేంద్రం, రాష్ట్రం నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రతి నిత్యం పని ధ్యాసగా ఉండే నాయకులు చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ అని అన్నారు. స్వచ్ఛత కోసం దేశంలో ఉన్న ఒకే ఒక కొలమానం స్వచ్ఛ సర్వేక్షణ్ అని అన్నారు. ప్రతి సిటీ రిపోర్టు కార్డు ఆన్ లైన్ లో ఉన్నాయన్నారు. టాప్ ఫిఫ్టీలో రాష్ట్రం నుండి 6 నగరాలు ఉన్నాయన్నారు. దక్షిణ భారత దేశంలో స్వచ్ఛతలో కొంత మేరకు మనం మెరుగ్గానే ఉన్నామన్నారు. రూ. 1146 కోట్ల బడ్జెట్ లో విశాఖ, విజయవాడ నగరాలే పారిశుధ్యంపై రూ. 340 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. జీవో ప్రకారం యూఎల్ బి లు తమ బడ్జెట్ లో 27 శాతం ఖర్చు చేయాలన్నారు. రూ. 100 కోట్లు పైగా చెత్త సేకరణకు డీజిల్ పై ఖర్చు చేస్తుంటే, విజయవాడలో వాహనాల డీజిల్ కోసం రూ. 30 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. వ్యయం తగ్గించే కార్యక్రమాల్లో భాగంగా 2,000 ఎలక్ట్రిక్ వెహికిల్స్ డోర్ టూ డోర్ చెత్త సేకరణ కోసం కొనుగోలు చేస్తున్నామన్నారు. మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రాష్ట్రంలోని అయిదు నగరాలకు వచ్చాయన్నారు. సూరత్, లక్నో వంటి నగరాలు ఒకప్పుడు మురికి నగరాలు అయితే ఈరోజు అవి క్లీన్ సిటీలుగా తయారయ్యాయన్నారు. శానిటేషన్ అనేది ప్రభుత్వ కార్యక్రమం కాదు ప్రజల కార్యక్రమమే అన్నారు. అప్పుడే ఇలాంటి కార్యక్రమాలు సక్సెస్ అవుతాయన్నారు. ఈ కార్యక్రమం సక్సెస్ కావాలంటే పై నుండి కింది వరకూ అందరికి ట్రైనింగ్ అవ్వాలన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ సర్వేక్షణ్ పై ఏర్పాటు చేసిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్ లకు గతంలో నాయకత్వం వహించి ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేశారన్నారు. క్లీన్ స్టేట్ , గ్రీన్ స్టేట్ అనేది స్వర్ణాంధ్రకు ఎంతో అవసరమన్నారు. పురపాలక శాఖ సంచాలకులు పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు ఉదయమే మున్సాపాలిటీల్లో పనులను తనిఖీ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి డెత్ ఇన్సూరెన్స్ వర్తించే విధంగా 20 లక్షల వరకు జనరల్ ఇన్సూరెన్స్ వర్తించే విధంగా యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ముందుగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు.

## కీలక సమస్యలపై సీఎంకు ఎమ్మెల్యే రాజగోపాల్ వివరణ



**జగ్గయ్యపేట ఆగస్టు 4(మనం న్యూస్):** జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గానికి సంబంధించిన కీలక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా, 2023-24 వరుసగా వచ్చిన భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న మునేరు నది పాత ఆనకట్టు, మునేరు కాలువలు, కాచవరం కాలువ మరమ్మత్తులపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వరదల ప్రభావంతో సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో వేలాది ఎకరాల పంటలు నష్టపోయాయి. శాసనసభ్యులు రాజగోపాల్ప్రధానంగా కోరిన అంశాలు. ఎఫ్టీఆర్ (ఎఫ్డిఆర్) కింద మునేరు మరియు కాచవరం కాలువల మరమ్మత్తుల కోసం రూ.3.30 కోట్లు మంజూరు చేయాలని మునేరు పాత ఆనకట్టు తక్షణ మరమ్మత్తుల కోసం రూ.19.09 కోట్లు మంజూరు చేయాలని అన్నారు. ఖరీఫ్ సీజన్ 2025-26లో పంటలకు సాగునీరు అందించేందుకు మునేరు నదిలో తాత్కాలికంగా రింగ్ బండ్లు నిర్మించేందుకు రూ.71.25 లక్షలు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆర్థిక శాఖకు తక్షణ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వత్సవాయి మండలంలోని పోలంపల్లి వద్ద ఉన్న 1894లో నిర్మితమైన మునేరు ఆనకట్టు కింద, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగావు మండలాల్లోని సువారు 25 గ్రామాలకు చెందిన 36,000 ఎకరాల ఆయకట్టు సాగునీటి పై ఆధారపడినది. వరదల కారణంగా పలు చోట్ల గండులు ఏర్పడి, కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే డిపార్ట్మెంట్ అధికారులు అంచనాలు సిద్ధం చేసి, సంబంధిత శాఖలకు నివేదికలు పంపారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఖరీఫ్ పంటలకు సాగునీరు అందకుండా, వేలాది మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కి వివరించారు.

ఈ అంశాలపై ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన దశల్లో ఆర్థిక శాఖతో సమన్వయం చేసి, తక్షణ నిధుల మంజూరు కొరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్పందన పట్ల శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయకట్టు రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కార్మికుల భద్రత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

### విశ్వ విద్యాలయాలతో ఫ్యాక్టరీలో భద్రత పెంచడం కోసం అవగాహనా ఒప్పందం



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 4(మనం న్యూస్):** విజయవాడ లేబర్ కమిషనర్ కార్యాయలంలో పారిశ్రామిక భద్రతను ప్రోత్సహించడానికి, నియంత్రణ,మద్దతు ఇవ్వడానికి, సామర్థ్యాన్ని పెంపొందించడానికి మరియు ఆధారిత విధాన రూపకల్పన కోసం పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, జేఎన్టీయూ అనంతపూర్ , డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మధ్య అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సెక్రటరీ శేషగిరి బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా ప్రమాదకర, రసాయన పరిశ్రమలలో భద్రతా ఆడిట్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే (హాజర్డ్ ఐడెంటిఫికేషన్ అండ్ రిస్క్ అసెస్మెంట్), (హాజర్డ్ అండ్ ఆపరేబిలిటీ స్టడీ), (హాజర్డ్ అనాలిసిస్ అండ్ రిస్క్ అసెస్మెంట్) వంటి సాంకేతిక అధ్యయనాలను చెప్పడం జరుగుతుందని, పారిశ్రామిక ప్రమాదాలను పరిశోధించి, మూల కారణాలను విశ్లేషించి నివారణ, దిద్దుబాటు చర్యలను సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. సాంకేతిక ఖచ్చితత్వం, పరిపూర్ణత కోసం మూడవ పక్ష భద్రతా ఆడిట్ నివేదికలను సమీక్షించడం జరుగుతోందన్నారు. భద్రతా నివేదికలు, ఆన్-సైట్ ఆఫ్-సైట్ అత్యవసర ప్రణాళికలతో సహా కీలకమైన చట్టబద్ధమైన భద్రతా పత్రాలను సిద్ధం చేయాలన్నారు. అంచనా వేయడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక భద్రతకు సంబంధించిన ప్రపంచ ఉత్తమ పద్ధతులు, అధునాతన సాంకేతికతలు మరియు విధాన మెరుగుదలలపై సలహా ఇవ్వడం జరుగుతుందని, నియంత్రణ సిబ్బంది మరియు ఫ్యాక్టరీ సిబ్బంది సామర్థ్య నిర్మాణానికి మరియు శిక్షణకు మద్దతు ఇవ్వడం. జరుగుతుందని, పారిశ్రామిక భద్రత మరియు ప్రమాద నిర్వహణ రంగంలో పరిశోధన సహకారాలు, డేటా ఆధారిత విశ్లేషణ, ఆధారాల ఆధారిత విధాన రూపకల్పనను ప్రోత్సహించడం. జరుగుతుందని ఈఅన్ని కార్యకలాపాలను నిర్వహించడానికి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, జెఎన్టియు అనంతపూర్ సాంకేతిక నైపుణ్యం, అధ్యాపక వనరులు, ప్రయోగశాల సహాయాన్ని తీసుకుంటున్నామని తెలియజేశారు. ముఖ్యంగా ఈ విశ్వవిద్యాలయం చేయవలసిన పనులు ఏమిటంటే సాంకేతిక అంచనాల కోసం అర్హత కలిగిన సిబ్బందిని నియమించడం, భద్రతా డాక్యుమెంటేషన్లో నైపుణ్యం, పరిశోధన ఇన్పుట్లు అందించడం, శిక్షణ మరియు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను రూపొందించడం మరియు అందించడం, ఫ్యాక్టరీల డైరెక్టరేట్ (డిఒఎఫ్) పని పరిధిని అమలు చేయడానికి అవసరమైన విధంగా కర్మాగారాలు, డేటా మరియు అధికారిక సమన్వయాన్ని పొందేందుకు వీలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా అత్యంత ప్రమాదకరమైన మరియు రసాయనక పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్లు చేయడం, ఈ కర్మాకారాల్లో సేఫ్టీ రిపోర్ట్ లను అత్యవసర పరిస్థితికి సంబంధించిన ప్లానులను విశ్లేషణ చేయటం జరుగుతుందని, యూనివర్సిటీలో వివిధ శాఖలతో కూడిన సెంటర్లను ఏర్పాటుచేసి కర్మాకారాల్లో భద్రత విషయమై సలహాలు ఇవ్వటం, భద్రతాధికారులకు, కార్మికులకు సంబంధిత అధికారులకు ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇవ్వడం, అంతర్జాతీయ ప్రమాణాలు కొత్త సాంకేతిక పద్ధతులను విషయంపై సలహాలు ఇవ్వడం, రసాయనక పరిశ్రమంలో జరిగిన ప్రమాదాలను విశ్లేషణ చేసి,ప్రమాదాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలని విషయంపై సలహాలు ఇవ్వటం, విద్యార్థులకు భద్రత విషయమై అవగాహన కల్పించడం కోరకు వారి పాఠ్యాంశాలలో భద్రతకు అవకాశం ఇవ్వటం ఈ విషయాలన్నిటిపై ఈ విషయాలన్నిటిపై విశ్వవిద్యాలయాల వారు సహాయ సహకారాలు అందజేస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ డిప్యూటీ కమిషనర్ గంధం చంద్రుడు, శ్రీ వెంకటేశ్వరయూనివర్సిటీ ప్రతినిధులు, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వెంగమాంబ భవనాన్ని తనిఖీ చేసిన టీటీడీ ఈవో



**తిరుమల,ఆగస్టు 04,మనం న్యూస్ :** మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో టిటిడి భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాల నాణ్యత, రుచిని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవో టిటిడి అందిస్తున్న అన్న ప్రసాదాల రుచి, నాణ్యతపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులు టిటిడి అందిస్తున్న అన్న ప్రసాదాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఈవో, అదనపు ఈవోతో కలసి అన్న ప్రసాద భవనంలో అన్న ప్రసాదాలు స్వీకరించారు. తరువాత కియోస్క్ మిషన్ ద్వారా ఎస్వీ అన్నప్రసాద ట్రస్ట్ కు విరాళం అందించారు. అనంతరం ఈవో అన్నప్రసాద భవనంలోని క్యూలైన్లు, పరిశుభ్రత, ముడి సరుకుల నిల్వ గది తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత ఈవో గ్యాస్ ప్లాంట్ ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నన్స్ అక్రమ అరెస్టులపై పెద్ద ఎత్తున నిరసన

### ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ

### సేవే పరమావధిగా క్రైస్తవ మిషనరీలు

### ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

### మోన్సిన్యోర్ రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్




**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 4(మనం న్యూస్):** చత్తీస్ ఘడ్ లో కేరళకు చెందిన ఇద్దరు నన్స్ (సిస్టర్స్)ను అక్రమ అరెస్ట్ లను నిరసిస్తూ, ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం విజయవాడలో అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో క్రైస్తవుల భారీ కొవ్వొత్తుల (క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణం నుండి ప్రారంభమై పి.డబ్ల్యూ.డి. గ్రౌండ్ అంబేద్కర్ స్మ ృతివనం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా విజయవాడ కేథలిక్ డయోసిస్ మోన్సిన్యోర్ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రెవ, ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ చత్తీస్ ఘడ్ లో నన్స్ పై కొంతమంది మతోన్మాదులు కుట్రలు పన్ని తప్పుడు ఆరోపణలు చేస్తూ వారిని అక్రమంగా అరెస్ట్ చేయించడాన్ని దేశంలోని అన్ని సంఘాలు, సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయని అన్నారు. నన్స్ కు బెయిల్ మంజూరైనప్పటికీ వారిపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కొన్నిరోజుల పాటు నన్స్ (సిస్టర్స్)ను జైళ్ళల్లో నిర్భంధించటం యావత్ క్రైస్తవ లోకాన్ని ఆందోళన కలిగించిందని తెలిపారు. సిస్టర్స్ పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం రాక పూర్వం నుంచే క్రైస్తవ మిషనరీలు సేవే పరమావిధిగా విద్య, వైద్య రంగాలలో పేదలను అక్కున చేర్చుకొని వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ, కక్ష్య సాధింపు చర్యలకు దిగటం రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి మత స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిందన్నారు. కనుక ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుందన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో భారతావనిలోని అనేక హాస్పిటల్స్ స్థాపించి, లక్షలాదిమంది గర్భస్థ తల్లులకు వైద్యసేవలు, పురిటిబిడ్డలకు వైద్యసేవలు అందిస్తున్న నన్స్ పై అక్రమ కేసులు పెట్టడం పట్ల భారతావనికే బాధకలుగుతుందన్నారు. బేతులు మినిస్ట్రీస్ ఛైర్మన్ రెవ, పాస్టర్ సల్లూరి జయకుమార్ బాబు మాట్లాడుతూ పేదలకు సేవలు చేస్తున్న నన్ను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందన్నారు. ఈ దేశ సమాజసేవలో భాగంగా క్రైస్తవ సంస్థలు పేదలకు సేవలు అందించటం, నేరమా అని ప్రశ్నించారు. నన్స్ తదితరవారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆర్.సి.యం, సియస్, లూథరన్, బాప్టిస్ట్, ఐపీసీ, మెట్రోపాలీటన్ తదితర క్రైస్తవ సంస్థలకు చెందిన సిస్టర్స్, యువతీ యువకులు పెద్ద ఎత్తున ప్లకార్డ్స్ చేత పట్టుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ, భారత రాజ్యాంగంను కాపాడాలని నన్స్ పైన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గుణదల మాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ తోట సునీల్, ఫాదర్ పసల తోమస్, సిస్టర్స్ (నన్స్)లు, సిస్టర్ సుగుణ, సిస్టర్ సుందరి, పాస్టర్స్ ఐ. కరుణానిధి, ఎస్. జయకుమార్ బాబు, గేరా హనోక్ పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఒడిషా గవర్నర్ డాక్టర్ కంభంపాటి



**తిరుమల,ఆగస్టు 04,మనం న్యూస్ :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరి బాబు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయం లోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు డైరీ, క్యాలెండర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ జి. భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 04(మనం న్యూస్):** సోమవారం నాడు ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఏడుగురు వైసిపి నేతలు రైతుల సమస్యల మీద కలక్టర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో సంవత్సర కాలంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. రైతులు సమస్యలు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రైతుల సమస్యలను కలక్టర్ కి చెబితే ఆయనకే ఈ సమస్యలు తెలియకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎరువుల కొరత సృష్టించిందన్నారు. రైతులు పండించిన పంటలు రోడ్డు మీద పోసే పరిస్థితి వచ్చిందన్నారు. దళారుల నుంచి బ్లాక్ లో కొనాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు రైతులను నట్టేట ముంచుతున్నాడని అన్నారు. వైసీపీ చెప్పిన సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలన్నారు. రైతుల కోసం ఎక్కడికైనా వెళ్లి పోరాడతామన్నారు.

# జుక్కల్ సామాజిక ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

- సూపరింటిండెంట్, డ్యూటీ డాక్టర్‌కు షోకాష్ నోటీస్ ఇవ్వాలని ఆదేశం



**కామారెడ్డి, ఆగస్టు 04 (మనంప్రతినిధి) :** విధులలో నిర్లక్ష్యం వహించిన జుక్కల్ సామాజిక ఆసుపత్రి సూపరింటిండెంట్, డ్యూటీ డాక్టర్ కు షోకాష్ నోటీస్ ఇవ్వాలని డిసిహెచ్ఎస్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా జుక్కల్ మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది డ్యూటీ రిజిస్టర్ ను పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్, డ్యూటీ డాక్టర్ డాక్టర్ విట్టల్ లు అందుబాటులో లేకపోవడంతో అగ్రహం వ్యక్తం చేసి వర్షాకాలం అనేక వ్యాధులతో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలు కొరకు వస్తు ఉంటారు ఇలాంటి సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోతే పేద ప్రజలకు ఎవరు వైద్యం చేస్తారని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ కు మరి డ్యూటీ డాక్టర్ కు షోకాజ్ నోటీస్ అందించాల్సిందిగా డి. సి. యచ్, ఎస్ డాక్టర్ విజయలక్ష్మిని జిల్లా కలెక్టర్ ఫోన్ ద్వారా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జుక్కల్ తాసిల్దార్ తదితరులు ఉన్నారు.

# రెంజల్‌లో మండలంలో పర్యటించిన కలెక్టర్

**నిజామాబాద్, ఆగస్టు 04 (మనం బ్యూరో) :** రెంజల్ మండలంలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సోమవారం విస్తృత పర్యటన చేపట్టారు. ముందుగా వీరన్నగుట్ట జెడ్పీహైస్కూల్తోపాటు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ విధానంలో హాజరు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతులపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, కిచెన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్ఎంలను ఆదేశించారు. అనంతరం పీహెచ్సీ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. పీహెచ్సీలో మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రంలోనూ టీచర్ లేకపోవడంతో చర్యలు తీసుకోవాలని సీడీపీఓను ఫోన్లో ఆదేశించారు. అలాగే సహకార సంఘం ఎరువుల గోడౌన్లో ఎరువుల నిల్వలు పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. పీఆర్, ఆర్డబ్ల్యుఎస్, ఆర్అండ్బీ, తదితర ఇంజనీరింగ్ విభాగాల ఏఈల క్షేత్రస్థాయి సందర్శనల వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో మూవ్మెంట్ రిజిస్టర్ నిర్వహించాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో దీన్ని అమలుపర్చాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై గ్రామం వారీగా సమీక్ష జరిపారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఆగస్టు 04 (మనం ప్రతినిధి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 142 ఆర్జీలను సమర్పించారు. ఫిర్యాదుదారుల నుండి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, లోకల్ బాడీస్ చందర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.






# ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలను ఇవ్వాలి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 04 ( మనం బ్యూరో) :** జిల్లాలోని ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలను ఇవ్వాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో డీవార్మింగ్ డే కార్యక్రమంపై సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., 19 ఏళ్ల వయసు లోపు విద్యార్థులందరికీ మాత్రలు వేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు, బడిబయట పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో కళాశాలలో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. భోజనం తిన్న తర్వాత ఈ మాత్ర వేయాలన్నారు. ప్రధానంగా రక్తహీనత, బరువు తగ్గుదల తదితర వ్యాధుల నుంచి కాపాడడానికి మాత్ర దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మైకుల ద్వారా పట్టణాల్లో చెత్త సేకరణ వాహనాల ద్వారా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 9, 10వ తేదీల్లో రెండు రోజులపాటు తప్పనిసరిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనాథ బాలల ఆశ్రమాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, రెస్క్యూ హోంలలో కూడా డీవార్మింగ్ డేను నిర్వహించాలని సూచించారు. 11వ తేదీన మాత్రలు ప్రతి విద్యార్థికి వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థులకు అందకపోతే మలివిడతగా 18వ తేదీన వేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 19 ఏళ్లలోపు వయసు కలిగిన వారు సుమారు 4.05 లక్షల మంది ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, అదనపు కలెక్టర్ అంకిత్, డీపీవో శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్ అశోక్, డీడబ్ల్యూవో రసూల్ బీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను చూస్తుంటే దేశ భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తుంది




- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు

**జుక్కల్, ఆగస్టు 04 (మనం న్యూస్) :** విద్యార్థులను చూస్తుంటే దేశ భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు అన్నారు. జుక్కల్ నియోజకవర్గం డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఎమ్మెల్యే షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., విద్యార్థులకు షూ డొనేట్ చేసిన శివరాజ్ పటేల్ కి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులను చూస్తుంటే దేశ భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తుందని అన్నారు. విద్యార్థి దశ అతి ముఖ్యమైనదని, విద్యార్థులందరూ బాధ్యతగా విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వ్యక్తిత్వ వికాసానికి, వ్యక్తి పురోగతికి, సమాజం మరియు దేశ అభ్యున్నతికి విద్య ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎంతో శ్రద్ధ, బాధ్యతతో పాఠాలు బోధిస్తూ వారి భవిష్యత్ కు బంగారు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలకు సంబంధించి ప్రహరీ గోడ, అదనపు తరగతి గదులు నిర్మిస్తామని,ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు ప్రారంభించే నాటికే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువారాలని కోరారు. విద్యార్థులకు విద్యా బుద్ధులతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విధంగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా గ్రామ పెద్దలు కూడా పాఠశాలలో చిన్న చిన్న సమస్యలు ఉంటే బాధ్యతగా ముందకు వచ్చి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

**జాతీయం- అంతర్జాతీయం**

# అమెరికాలో పెట్టుబడులకు భారతీయులు సై..!




**వాషింగ్టన్, ఆగస్టు 4 :** అగ్రరాజ్యం అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయులు బాగా ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగాలకు అవసరమైన హెచ్1బీ వీసాలు రావడం కష్టంగా మారినా.. వ్యాపారానికి అవసరమైన ఈబీ-5 వీసాలకు మాత్రం డిమాండ్ తగ్గలేదని డేటా చెబుతోంది. త్వరలో వీటిని ట్రంప్ ప్రకటించిన గోల్డ్ కార్డులతో భర్తీ చేయనున్న విషయం తెలిసిందే.

తాజాగా ఈబీ-5 దరఖాస్తులకు సంబంధించిన డేటాను పరిశీలిస్తే.. గతంలో ఎన్నడూ లేనంతగా భారతీయులు దీనికోసం ఏడాది వ్యవధిలో దరఖాస్తు చేసుకొన్నట్లు అర్థమవుతుంది. గతేడాది ఏప్రిల్ 2024 నుంచి భారతీయుల్లో దీనికి ఆదరణ పెరిగింది. యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ డేటా ''2025 ఆర్థిక సంవత్సరం (అక్టోబర్ 2024 నుంచి జనవరి 2025)లో భారతీయుల నుంచి 1,200కు పైగా ఐ-526ఈ పిటిషన్లు వచ్చాయి'' అని యూఎస్ఐఎఫ్ సీఎంవో నికోలస్ మాస్ట్రోన్నీ-3 పేర్కొన్నారు.

ఇతర రకం వీసాల జారీలో పెద్దసంఖ్యలో బ్యాక్‌లాగ్ ఉండటంతో ఈబీ-5కు డిమాండ్ పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్1బీ, గ్రీన్‌కార్డుల జారీ కష్టంగా మారడం కూడా దీనికి కారణమైంది. ఇప్పటివరకు ఇమిగ్రేషన్ సంస్థ వద్ద దాదాపు 1.1 కోట్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో వేగంగా లభించే ఈబీ-5ను అమెరికా శాశ్వత నివాసానికి మార్గంగా ఎంచుకొన్నారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఇన్వెస్ట్ ఇన్ ది యూఎస్ఏ' సంస్థ డేటా ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయులకు 1,428 ఈబీ-5 వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య కేవలం 815 మాత్రమే. అమెరికాలో గ్రీన్‌కార్డ్ కోసం అక్కడి ప్రభుత్వం నిబంధనలు మరింత కఠినతరం చేసింది. తాజాగా యూఎస్ సిటిజన్షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ వీటిని ప్రకటించింది. కుటుంబసభ్యులకు జారీ చేసే ఇమిగ్రెంట్ వీసాలకు కూడా స్క్రీనింగ్, వెట్టింగ్ ప్రక్రియను కఠినతరం చేసింది. అనర్హమైన అప్లికేషన్లు తొలగించేందుకు దీనిని చేపట్టినట్లు ప్రకటించింది.

యూఎస్సీఐఎస్ సంస్థ మరింత పకడ్బందీగా అర్హమైన వివాహాలను, సరైన కుటుంబసంబంధాలను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందని వెల్లడించింది. దీంతోపాటు అవసరమైన చట్టాలను పాటిస్తున్నారని ధ్రువీకరించుకొనేందుకు ఇది అవసరమని భావించారు. ఇక జాతీయ భద్రతకు ఇబ్బందిలేకుండా ఇబ్బందికర వ్యక్తులను గుర్తించేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. వీటిని పెండింగ్‌లో ఉన్న, కొత్తగా దరఖాస్తు చేసుకొన్న వాటికి వర్తింపజేయనున్నారు.

నకిలీ వివాహాలు చేసుకొని అమెరికాలోకి ప్రవేశించే వారిని అరికట్టడం కూడా దీని లక్ష్యం. ఇకనుంచి వివాహాలకు సంబంధించి అధికారులకు మరింత సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వీటిల్లో జాయింట్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్, ఫొటోగ్రాఫ్, మిత్రులు, బంధువుల నుంచి అభినందన పత్రాలు వంటివి ఉన్నాయి. దీంతోపాటు వీసా దరఖాస్తుదారులు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి. స్పాన్సర్ గతంలో ఎవరికైనా స్పౌస్‌ల వీసాలు జారీ చేసినా.. ఇమిగ్రేషన్ రికార్డుల్లో తేడాలు ఉన్నా వాటిని యూఎస్సీఐఎస్ మరింత లోతుగా దర్యాప్తు చేపడుతుంది.

# అణు బెదిరింపుల పట్ల మరింత

- అప్రమత్తత అవసరం: రష్యా

**మాస్కో, ఆగస్టు 4 :** రష్యాకు చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ నౌకాదళాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే రష్యా స్పందిస్తూ.. తమ వద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని పేర్కొంది. తాజాగా ఈ విషయంపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ.. అణ్వాయుధాల వ్యాప్తిని నిరోధించడంపై తాము మరింత శ్రద్ధ వహిస్తామన్నారు. అణు బెదిరింపుల విషయంలో ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రపంచ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు.




ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ త్వరలో మాస్కోలో పర్యటించనున్న నేపథ్యంలో దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విట్కాఫ్ పర్యటనపై మాట్లాడుతూ.. ఆయన్ను మాస్కోకు ఆహ్వానించడానికి తాను ఎదురు చూస్తున్నానన్నారు. అటువంటి వారితో సంబంధాలు మెరుగుపరుచుకోవడం చాలా ముఖ్యమైన విషయంగా భావిస్తున్నట్లు తెలిపారు. వీలైతే ఆయన పుతిన్‌తోనూ సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

కాగా ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ అంశంలో కాల్పుల విరమణకు 10 రోజుల్లో ముందుకు రావాలని రష్యాకు హెచ్చరికలు చేశారు. దీంతో ఆగ్రహించిన మాస్కో మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ రష్యా వద్ద సోవియట్ యూనియన్ హయాం నాటి అణు దాడి సామర్థ్యం ఉందన్నారు. దీంతో ఆ దేశానికి చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని అమెరికా అధ్యక్షుడు ఆదేశించారు. ''ఒకవేళ మెద్వెదేవ్ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనుక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేశా. మాటలు ముఖ్యం. వాటివల్ల కొన్నిసార్లు అవాంఛిత పరిణామాలు తలెత్తవచ్చు. ప్రస్తుత అంశంలో ఇలాంటివి జరగవని ఆశిస్తున్నా'' అని తెలిపారు.

# చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు? కేంద్రానిది 'డీడీఎల్జే' పాలసీ

## కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శ

**ఢిల్లీ, ఆగస్టు 4 :** కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 15, 2020న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధాని.. మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు అమరులైనప్పటి నుంచి.. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడు అనేక ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. సమాధానాలు ఇవ్వడానికి బదులుగా, మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' (డినై,డిస్ట్రాక్,అబద్ధంచెప్పు, సమర్థించు) అనే విధానాన్ని అనుసరిస్తూ వస్తోందంటూ ధ్వజమెత్తారు.



జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులైనా సృష్టించగదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. చైనా మన భూ భాగాన్ని ఆక్రమించిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను సోమవారం సుప్రీం కోర్టు తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం.. నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరంటూ వ్యాఖ్యానించింది.

# చైనా ఆక్రమించిందని మీకెలా తెలుసు?

- రాహుల్ గాంధీకి ప్రశ్నించిన సుప్రీంకోర్టు


**ఢిల్లీ, ఆగస్టు 4 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరని వ్యాఖ్యానించింది. రాహుల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న సమస్యలను ప్రశ్నించకపోతే రాహుల్ ప్రతిపక్ష నాయకుడు ఎలా అవుతారని వాదించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఏదైనా సమస్య లేదా విషయంపై మాట్లాడాలంటే పార్లమెంటులో మాట్లాడాలని.. సోషల్ మీడియాలో కాదని పేర్కొంది. ఇటువంటి సమస్యలను పార్లమెంటులో ఎందుకు లేవనెత్తరని ప్రశ్నించింది. 2022లో దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ..పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''2020 జూన్లో లడఖ్‌లోని గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన హింసాత్మక ఘర్షణ సమయంలో దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూగాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. ఇది ఢిల్లీ వైశాల్యం కంటే ఎక్కువ. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్నవారు దాని గురించి ఒక్క ప్రశ్న కూడా అడగరు. అరుణాచల్‌ప్రదేశ్‌లో 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆ భూభాగాన్ని తిరిగి ఇవ్వాలంటూ మన సైన్యం చైనా సైన్యంతో చర్చలు జరిపినప్పటికీ ప్రధాని మోడీ ఈ విషయంలో అబద్ధాలు చెబుతున్నారు.. ఆక్రమణే జరగలేదంటున్నారు. దీని గురించి దేశ మీడియా ప్రశ్నించడం లేదు. ఇది నిజం కాదా..? ఇదంతా యావత్ దేశం గమనిస్తోంది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో రాహుల్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దేశ సైన్యాన్ని అవమానించేలా మాట్లాడారని ఆరోపిస్తూ 2022లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి న్యాయస్థానంలో ఫిర్యాదు దాఖలు చేశారు.



# నెతన్యాహూపై ఒత్తిడి తీసుకురండి

## ట్రంప్‌నకు ఇజ్రాయెలీ మాజీ అధికారుల లేఖ

**జెరుసలెం, ఆగస్టు 4 :** ఇజ్రాయెల్- హమాస్ యుద్ధంతో గాజాలో పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటికే 60వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. స్థానికంగా ఆకలి కేకలు మిన్నంటాయి. ఈ పరిణామాల నడుమే.. గాజాలో యుద్ధాన్ని ఆపేలా ప్రధాని నెతన్యాహూపై ఒత్తిడి తీసుకురావాలని ఇజ్రాయెల్‌కు చెందిన దాదాపు 600 మంది విశ్రాంత భద్రతా అధికారులు, నిఘా సంస్థల మాజీ అధిపతులు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేఖ రాశారు. హమాస్ ఇకపై తమ దేశానికి వ్యూహాత్మక ముప్పు కాదని.. వృత్తిపరమైన అనుభవంతో ఇది చెబుతున్నట్లు పేర్కొన్నారు.



హమాస్‌ను పూర్తిస్థాయిలో ఓడించడం ద్వారానే బందీలను విడిపించేందుకు నెతన్యాహు కృషి చేస్తున్నారనే వాదనలు ఉన్నాయి. ఇది కాస్త.. గాజాలో మరిన్ని దాడులకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. కాల్పుల విరమణకు ఒత్తిడి తీసుకొస్తున్న మిత్రదేశాలను ఈ పరిణామాలు మరింత ఆగ్రహానికి గురిచేయొచ్చని అంచనా వేస్తున్నారు. బందీల కుటుంబాలకు మద్దతుగా నిలుస్తున్న ఓ గ్రూప్ సైతం.. సైనిక కార్యకలాపాల విస్తరణ ఆలోచనలను ఖండించింది. ఇజ్రాయెల్‌ను, బందీలను నెతన్యాహు వినాశనం వైపు నడిపిస్తున్నారని మండిపడింది. ట్రంప్‌నకు రాసిన లేఖలో.. మొసాద్ మాజీ చీఫ్ తామీర్ పార్డో, షిన్ బెట్ మాజీ చీఫ్ అమీ అయలోన్, మాజీ ప్రధాని ఎహూద్ బరాక్, రక్షణశాఖ మాజీ మంత్రి మోషే యాలోన్ తదితరులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అన్ని సైనిక లక్ష్యాలను సాధించినప్పటికీ.. యుద్ధాన్ని కొనసాగించడంపై అయలోన్ విమర్శలు గుప్పించారు.

''నెతన్యాహును, ఆయన ప్రభుత్వాన్ని సరైన దిశలో నడిపించే సామర్థ్యం మీకు ఉంది. గాజా యుద్ధాన్ని ముగించండి. లెబనాన్‌లో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. గాజా విషయంలోనూ చొరవ చూపాల్సిన సమయం ఆసన్నమైంది. బందీలను విడిపించేలా చర్యలు తీసుకోండి'' అని విశ్రాంత ఐడీఎఫ్ జనరల్స్, మొసాద్, షిన్ బెట్ అధికారులు, పోలీసులు, దౌత్యాధికారులతో కూడిన 'సీఐఎస్' గ్రూప్ ట్రంప్‌నకు రాసిన లేఖలో పేర్కొంది. ఒకవైపు బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ వీడియోలు విడుదల చేయడం.. మరోవైపు గాజాలో దాడులను మరింత విస్తరించేందుకు నెతన్యాహు ప్రయత్నిస్తున్నారనే నివేదికల నడుమ ఈ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

# దివి సీమను పునర్నిర్మించిన మండలి చిరస్మరణీయులు

- ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు
- అవనిగడ్డలో ఘనంగా వెంకట కృష్ణారావు శత జయంత్యుత్సవాలు షురూ..

**అవనిగడ్డ, ఆగస్టు 04(మనం న్యూస్):** ఉప్పెనకు ధ్వంసమైన దివి సీమను పునర్నిర్మించిన మండలి వెంకట కృష్ణారావు చిరస్మరణీయులని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. సోమవారం ఉదయం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధిగా విచ్చేసిన రఘురామ కృష్ణంరాజు, ఆత్మీయ అతిధులు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజ కుమారి వంతెన సెంటరులో మండలి వెంకట కృష్ణారావు కాంశ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గాంధీ క్షేత్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం, స్వచ్ఛంద రక్తదాన శిబిరం ప్రారంభించారు. వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య అతిధి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగు వారందరిని ఏకం చేసిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అన్నారు. ఆయన స్ఫూర్తితో తెలుగు భాష పట్ల మక్కువతో మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న కృషి గమనించి ఆయన పట్ల అభిమానం, గౌరవం, పవిత్ర భావన కలిగాయన్నారు. తండ్రి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న బుద్ధప్రసాద్ స్ఫూర్తి ప్రదాత అన్నారు. గత ప్రభుత్వంలో భాషను హరించే విధంగా నాటి ముఖ్యమంత్రి, పాలకులు ఆలోచించిన విధానంపై పార్లమెంటులో గళమెత్తి తాను చేసిన పోరాటం అనేక మలుపులు తిరిగి నాటి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు వచ్చిందన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం బుద్ధప్రసాద్ చేస్తున్న కృషికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ దివిసీమ ఉప్పెనకు అనేక గ్రామాలు కొట్టుకుపోయి వేలాదిమంది చనిపోయిన సమయంలో మండలి వెంకట కృష్ణారావు నెలల తరబడి ఇంటికి వెళ్ళకుండా సహాయక చర్యలు నిర్వహించి ప్రపంచం దృష్టిని ఆకర్షించి దేశ విదేశాల నుంచి సహాయాన్ని సమీకరించి దివిసీమను పునర్ నిర్మించారని తెలిపారు. తెలుగు భాషను కాపాడే కుటుంబంగా మండలి కుటుంబం తరతరాలుగా పనిచేస్తుందన్నారు. తరాలు గడచిన మరువలేని అజరామర కీర్తి మండలి వెంకటకృష్ణారావు సొంతమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, రాష్ట్ర ప్రగతికి అంకితభావంతో కృషి



చేసిన మండలి వెంకట కృష్ణారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ 1977దివిసీమ ఉప్పెన సమయంలో మండలి వెంకట కృష్ణారావు సహాయక చర్యల్లో నిమగ్నమై చిక్కిపోయి, కన్నీళ్లు కార్చి కార్చి ముఖంపై కన్నీటి చారలు ఎండిపోయి, కళ్ళు లోతుకుపోయి అహోరాత్రులు శ్రమించిన తీరు నేటికీ మరువలేమన్నారు. ఆనాడు తాము తెనాలి నుంచి శాంతి మహిళా మండలి ద్వారా రెండు గ్రామాల్లో ఉప్పెన బాధితులకు సహాయం చేశామన్నారు. కృష్ణారావు ఎంతో పట్టుదల దీక్షతో దివి సీమను పునర్నిర్మించారని తెలిపారు. సమైక్యవాదిగా నిరాడంబర జీవిగా జీవితం సాగించిన మండలి వెంకటకృష్ణారావు తన బిడ్డలు, మనుమళ్లకు వారసత్వంగా ఆస్తిని కాకుండా సంస్కృతి, సంస్కారం, సభ్యత, నిరాడంబరత అందించారన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు చరిత్రలో నిలిచిపోయే వ్యక్తి అన్నారు. ఉప్పెన సహాయక చర్యలతో దివిసీమకు గుర్తింపు తెచ్చిన మహనీయుడు అన్నారు. రాష్ట్ర మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ చెప్పిన మాటలను చేతలుగా మార్చగల శక్తి కలిగిన కొద్దిమంది నాయకుల్లో కృష్ణారావు ఒకరు అన్నారు. దివిసీమ ఉప్పెన సహాయక చర్యల్లో కాళ్లకు రక్తము చీము కారుతున్నా బ్యాండేజీలు కట్టుకొని సహాయక చర్యలు కొనసాగించిన గొప్ప సేవామూర్తి అన్నారు. దేశ విదేశాల నుంచి స్వచ్ఛంద సంస్థల సహాయాన్ని రప్పించి దివిసీమలో అనేక గ్రామాలు, రోడ్లు నిర్మించారన్నారు. మృదువైన ఆప్యాయతతో కూడిన మాట లతో నిరాడంబరంగా స్వచ్ఛంగా జీవించిన గొప్ప నేత కృష్ణారావు అన్నారు. రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పటికీ నక్సలేట్ల భయం లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసిన ధీరోదాత్తుడు, మొనగాడు, మగాడు కృష్ణారావు అన్నారు. ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరిని హైదరాబాద్ రప్పించి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం ద్వారా తెలుగు జాతి వికాసానికి, తెలుగు భాష ఔన్నత్యానికి విశేష కృషి చేశారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా కృష్ణారావు చేసిన సంస్కరణలు నేటి పాలకులకు శిరోధార్యంగా నిలుస్తాయన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి మాజీ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారత ప్రధాని పీవీ నరసింహారావు తన కుమారుడు పీవీ రంగారావు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో మండలి వెంకట కృష్ణారావు అమలు చేసిన విధానాలను కొనసాగించి మంచి పేరు తెచ్చుకోవాలని చేసిన సూచన మండలి వెంకట కృష్ణారావు స్థాయికి ప్రత్యక్ష నిదర్శనం అని తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ కార్యదర్శి వైకుంఠం ప్రభాకర చౌదరి, మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, కమ్మిలి విఠల్, పిఠాపురం ఆధ్యాత్మిక పీఠం అధినేత ఉమర్ అలీషా, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టీ.గౌరీ శంకర్, నెల్లూరు క్లాసికల్ తెలుగు సెంటర్ మాజీ డైరెక్టర్ మునిరత్నం నాయుడు, వివిధ రంగాల ప్రముఖులు , పెద్దలు మండలి అభిమానులు, పార్టీలకు అతీతంగా నాయకులు తరలివచ్చారు.

## మరో రూ.12,717 కోట్ల విద్యుత్ బాదుడుకు రంగం సిద్ధం



- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబురావు

**విజయవాడ సెంట్రల్, ఆగస్ట్ 4(మనం న్యూస్):** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 61వ డివిజన్, శాంతినగర్, పలు ప్రాంతాల్లో సిహెచ్ బాబురావు తదితర, సిపిఎం నేతలు, ప్రజాసంఘాల కార్యకర్తలు ఇంటింటికి తిరిగి విద్యుత్ బాదుడు, స్మార్ట్ మీటర్ల పై ప్రచారం నిర్వహించారు. సంతకాలు సేకరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. వీధి సమావేశాలు జరిపారు. విద్యుత్ బారాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి దగా చేసిందని నిరసన తెలుపుతున్నారు. సూపర్ సిక్స్ హామీలు నత్తనడగా సాగుతుండగా, భారాలు వేగంగా వేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వినియోగదారుల బిల్లుల పరిశీలనలో వెల్లడైన అంశాలను వివరించారు. వంద శాతం నుండి 525 శాతం వరకు సర్దుబాటు చార్జీలు, అదనపు ఫీజులు వసూలు చేస్తున్నట్లు గమనించామన్నారు. 2019 24 సంవత్సరాలలో వినియోగించుకున్న విద్యుత్ పై మళ్లీ ట్రూ అప్ చార్జీల పేరుతో 12,717 కోట్ల రూ. భారం మోపుతూ పంపిణీ సంస్థలు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి, విద్యుత్ నియంత్రణ మండలి దీనిపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నదన్నారు. ప్రభుత్వ అనుమతితోనే పంపిణీ సంస్థలు ఈ భారాల ప్రతిపాదనలు పొందుపరిచారన్నారు. 202223 సంవత్సరాలు సంబంధించి ఇప్పటికే 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు చార్జీలు మోపి వసూలు చేస్తున్నారని తెలిపారు. నెలకు యూనిట్ కు 40 పైసలు చొప్పున ఈ సంవత్సర కాలంలో 2787 కోట్ల రూపాయలు ఇంధన సర్దుబాటు చార్జీలు వసూలు చేశారని పేర్కొన్నారు. నెల నెల వాటిని కొనసాగిస్తున్నారని అన్నారు.

## ఏపీలోని కేంద్ర వర్సిటీలకు ఐదేళ్లలో రూ.529 కోట్ల కేటాయింపు

- ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర విశ్వవిద్యాలయాల నిధుల అంశంపై ప్రశ్నించిన ఎంపీ కేశినేని శివనాథ్



**ఢిల్లీ, ఆగస్టు 04(మనం న్యూస్):** గత ఐదు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్లోని రెండు కేంద్ర విశ్వవిద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం రూ.529.14 కోట్లు కేటాయించి, పూర్తిగా విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం (సియుఎపి) కు 2020-21 నుండి 2024-25 వరకు రూ. 404.05 కోట్లు విడుదల చేయగా, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం (సిటియుఎపి)కు గత ఐదేళ్లలో రూ. 125.09 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ వెల్లడించారు. లోక్ సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఏపీలోని కేంద్ర విశ్వవిద్యాలయాల నిధుల అంశంపై కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖను అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్. సుకాంత మజుందార్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాల విషయానికి వస్తే, గిరిజన విశ్వవిద్యాలయంలో అన్ని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేస్తున్నారని తెలిపారు. అయితే, ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వ విద్యాలయంలో ఒక అధ్యా పక పోస్టు, మూడు బోధనేతర పోస్టులు మాత్రం ఇంకా ఖాళీగా ఉన్నాయని వివరించారు. గిరిజన విశ్వవిద్యాలయంలో 18 మంది అధ్యాపకులు, 12 మంది బోధనేతర సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం లో 15 మంది అధ్యాపకులు, 6 గురు బోధనేతర సిబ్బంది పని చేస్తున్నట్లు కేంద్ర మంత్రి డాక్టర్. సుకాంత మజుందార్ తెలిపారు. భవిష్యత్ నిధులపై స్పందిస్తూ, విద్యాశాఖ నుంచి విశ్వవిద్యాలయాలకు నేరుగా నిధులు ఇవ్వబడవని, కేంద్ర ప్రభుత్వం యూజీసీకి బ్లాక్ గ్రాంట్ రూపంలో నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఆ తర్వాత యూజీసీ ఆయా విశ్వవిద్యాలయాల అవసరాలు, గతంలో నిధుల వినియోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిధులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. ఈ విధానం ప్రకారం అవసరాలు పెరిగినపుడు నిధులు కూడా పెరుగుతాయని కేంద్ర మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ వివరించారు.

## శ్రీవారిని సన్నిధిలో కర్ణాటక గవర్నర్



**తిరుమల,ఆగస్టు 04(మనం న్యూస్):** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సోమవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు డైరీ, క్యాలెండర్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ జి. భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.3 కోట్ల 34 లక్షల 70 వేల 370లు

**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 04(మనం న్యూస్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపైన వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ దేవస్థానములో హుండీలు తెరచి లెక్కించగా సుమారు 19 రోజుల వ్యవధిలో నగదు రూ.3 కోట్ల,34 లక్షల 70 వేల 370 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఇఒ శీనా నాయక్ తెలిపారు. బంగారం 265 గ్రాములు, వెండి 7 కేజీలు కాగా రూ.2,000 పాత నోట్లు 7వచ్చినట్లు తెలిపారు. ఇవి కాకుండా విదేశీ మారక ద్రవ్యం కూడా దుర్గమ్మ హుండిలో భక్తులు వేశారు.

వాటి వివరాలిలా ఉన్నాయి.

1. యుఎస్ ఎ డాలర్స్ -707, 2. ఇంగ్లాండ్ పౌండ్స్ - 130, 3. సింగపూర్ డాలర్స్ - 60, 4. ఆస్ట్రేలియా డాలర్స్ - 255, 5. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిరహమ్స్ 210, 6. సౌదీ రియల్స్ 11, 7.ఒమన్ బియాసలు- 400, 8. నేపాల్ రూపాయలు-340, 9. మలేషియా రింగిట్‌లు- 120, 10. యూరప్ యూరోస్ - 30, 11. కువైట్ దినార్‌లు 13.1/3 , 12. ఒమన్ రియల్ 1, 13. కెనడా డార్లు 100 లుగా ఉన్నాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి. కె. శీనానాయక్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగగా, ఆలయ సహాయ కమిషనర్ సి హెచ్ రంగారావు, దేవాదాయ శాఖ అధికారులు, వన్ టౌన్, ఎస్. పి. ఎఫ్ పోలీసులు పర్యవేక్షణ చేశారు.





## గవర్నర్ అశోక్ గజపతి రాజుకు టీడీపీ ఎంపీల సత్కారం



**ఢిల్లీ, ఆగస్టు 04(మనం న్యూస్):** ఢిల్లీ పర్యటనలో ఉన్న గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు సోమవారం పార్లమెంట్ లోని టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టిడిపి ఎంపీలు గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజుకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. గోవా గవర్నర్‌గా పద వీ బాధ్యతలు చేపట్టిన గవర్నర్ అశోక్ గజపతి రాజుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానాయన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, ఎంపీలు లావు శ్రీ కృష్ణ దేవరాయులు, హరీష్ మాధుర్, ఎం. శ్రీ భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే కొండబాల

- కొండబాలది దశాబ్దాల ప్రజా జీవితం
- ప్రజల అవసరాలు తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, ఆగష్టు 4(మనం బ్యూరో):** మాజీ ఎంఎల్ఏ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో టిపిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పి కొండబాలను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేగా, టిడిపి జిల్లా అధ్యక్షునిగా సర్పంచి స్థాయి నుంచి మొదలుకొని ఎమ్మెల్యేగా దశాబ్దాల కాలాల పాటు రాజకీయ అనుభవం కలిగిన కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానన్నారు. స్థానిక సంస్థలు, సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ గా, టిఆర్ఎస్ హయాంలో కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన ఆయనకు చట్టసభలపై చక్కని అవగాహన ఉందన్నారు. అందరం కలిసి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలను, ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజల వద్దకు తీసుకువెళ్దామని అన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీలను నిర్వహించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ.



**విజయవాడ సెంట్రల్, ఆగస్టు 04(మనం న్యూస్):** ప్రతినెల 5వ తేదీన అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర యాప్) పై అవగాహన ర్యాలీలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో సోమవారం డిజిటల్ సేవలలో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర యాప్) ప్రజల చేతిలో ప్రభుత్వం అనే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ ను తీసుకురావడం జరిగిందని, దీనిలో భాగంగా 26 శాఖలకు చెందిన 530 కు పైగా సేవలు ప్రతి పౌరునికి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మనమిత్ర వాట్సాప్ 95523 00009 అనే నంబర్ పై అవగాహన కల్పించాలన్నారు. మనమిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ ఈ నెల 5వ తేదీ మంగళవారం నుండి ప్రతి నెల 5వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ర్యాలీలను నిర్వహించాలని, ఒకవేళ ఆరోజు సెలవు రోజైతే మరుసటి రోజు నిర్వహించాలన్నారు. అవగాహన ర్యాలీలలో విఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు పాల్గొనాలని, అలాగే అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్లు వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు కూడా ఈ ర్యాలీలో పాల్గొని అవగాహన కల్పించాలని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రతినెల 5వ తేదీ నిర్వహించే ర్యాలీలపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశా ఆదేశించారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి జ్యోతి, డిఆర్ డిఎ పిడి. ఏఎన్వి నాంచారరావు, ఉన్నారు.

## ఆశ్రమ విద్యార్థినుల అస్వస్థతపై మాజీ ఎంపీ ఆరా



**ఖమ్మం, ఆగస్టు 4(మనం న్యూస్):** ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో పలువురు బాలికలు సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు ఆరా తీశారు. విద్యార్థిను లు ప్రస్తుతం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండ గా, వారి ఆరోగ్య పరిస్థితిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వారిని జిల్లా కేంద్రానికి తీసుకు వెళ్ళి వైద్యం అందించాలన్నారు. గత పదిహేడవ లోక్ సభ సమయంలో తన నిధులు నుండి కేటాయించిన అంబులెన్సు స్థానిక కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్లోనే అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు జరిగిన ప్రతిసారీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతూనే, సమస్యల మూలాలను పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలు గిరిజన పిల్లలకు విద్య అందించే ముఖ్య కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థుల ఆహార నాణ్యత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న వరుస సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో పాటు అధికారులను కోరారు. ఈ ఘటనపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని నామ పేర్కొన్నారు.

# చరిత్ర సృష్టించిన సిరాజ్..



**● కపిల్ దేవ్ రికార్డు బ్రేక్**

ది ఓవల్ మైదానం వేదికగా ఇంగ్లండ్ తో జరిగిన ఐదో టెస్టులో టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ అసాధరణ ప్రదర్శన కనబరిచాడు. తన సంచలన బౌలింగ్ తో భారత్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్ సెకెండ్ ఇన్నింగ్స్ లో సిరాజ్ ఐదు వికెట్లతో చెలరేగాడు. మొత్తంగా 9 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ది మ్యాచ్ గా నిలిచాడు. ఈ క్రమంలో సిరాజ్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.

**సిరాజ్ సాధించిన రికార్డులు ఇవే..**

● ఐఇంగ్లండ్ గడ్డపై అత్యధిక టెస్టు వికెట్లు తీసిన మూడో భారత బౌలర్ గా సిరాజ్ నిలిచాడు. సిరాజ్ ఇప్పటివరకు ఇంగ్లండ్ లో 46 టెస్టు వికెట్లు సాధించాడు. ఇంతకుముందు ఈ రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ పేరిట ఉండేది. కపిల్ దేవ్ తన టెస్టు కెరీర్ లో ఇంగ్లండ్ గడ్డపై 43 వికెట్లు సాధించాడు. తాజా ఇన్నింగ్స్ లో స్మిత్ ను ఔట్ చేసి ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ రేర్ ఫీట్ సాధించిన జాబితాలో జస్ప్రీత్ బుమ్రా(51), ఇషాంత్ శర్మ(51) సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

● ఐఅదేవిధంగా ఇంగ్లండ్ లో జరిగిన ఒక టెస్టు సిరీస్ లో భారత్ తరపున అత్యధిక వికెట్లు (23) తీసిన బౌలర్ గా బుమ్రా రికార్డును సిరాజ్ సమం చేశాడు. బుమ్రా 2021-22 పర్యటనలో ఇంగ్లండ్ పై 23 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్ లో సిరాజ్ మరో వికెట్ తీసి ఉంటే బుమ్రాను ఆధిగమించేవాడు.

● ఐవరల్ టెస్ట్ ఛాంపియన్ షిప్ హిస్టరీలో అత్యధిక సార్లు ఫైవ్ వికెట్ హాల్ సాధించిన నాలుగో బౌలర్ గా అక్షర్ పటేల్ రికార్డును సిరాజ్ సమం చేశాడు. అక్షర్ ఇప్పటివరకు 5 సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించగా.. సిరాజ్ కూడా సరిగ్గా ఐదు సార్లు ఈ ఫీట్ సాధించాడు.

డబ్ల్యూటీసీలో అత్యధిక త్యధిక సార్లు ఫైవ్ వికెట్ హల్ సాధించిన బౌలర్ల జాబితాలో జస్ప్రీత్ బుమ్రా (12) అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాత అశ్విన్ (11), రవీంద్ర జడేజా (6) జడేజా కొనసాగుతున్నారు.

ఇక ఈ సిరీస్ లో సిరాజ్(23 వికెట్లు) లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు.

## ఒంటిచేత్తో బ్యాటింగ్‌కు దిగిన వోక్స్

భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన ఐదో టెస్ట్ మ్యాచ్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఎంట్రీకి వేదికైంది. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ ఆటగాడు క్రిస్ వోక్స్ భుజం విరిగినప్పటికీ ఒంటిచేత్తో బ్యాటింగ్ కు దిగి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆట చివరి రోజు ఇంగ్లండ్ గెలుపుకు 18 పరుగులు అవసరమైన దశలో వోక్స్ 11వ నంబర్ ఆటగాడిగా ఎంట్రీ ఇచ్చాడు. అతని ఎంట్రీ



సినిమా ఎలివేషన్ ను తలపించింది. వోక్స్ బ్యాటింగ్ చేయలేకపోయినా స్ట్రయిక్ రొటేట్ చేసి ఇంగ్లండ్ ను గెలిపించేందుకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టవశాత్తు ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ భారత్ చేతిలో 6 పరుగుల తేడాతో పరాజయంపాలైంది. ఫలితంగా భారత్ ఐదు మ్యాచ్ ల సిరీస్ ను 2-2తో సమం చేసుకుంది. ఇదే సిరీస్ నాలుగో టెస్ట్ లో టీమిండియా ఆటగాడు రిషబ్ పంత్ కూడా పాదం ఫ్రాక్చర్ అయినప్పటికీ జట్టు ప్రయోజనాల కోసం బరిలోకి దిగి అందరి మన్ననలు అందుకున్నాడు. 1984లో విండీస్ ఆటగాడు మాల్కమ్ మార్షల్ కూడా వోక్స్ తరహాలోనే ఒంటిచేత్తో బ్యాటింగ్ కు దిగాడు. ఇంగ్లండ్ తో జరిగిన ఆ మ్యాచ్ లో మార్షల్ ఒంటిచేత్తో బౌండరీ బాదిన సన్నివేశాన్ని క్రికెట్ ప్రపంచం ఎన్నటికీ మరిచిపోదు.




## రాజాసాబ్ బ్యూటీ బర్త్ డే.. స్పెషల్ పోస్టర్ రిలీజ్

బ్యూటిఫుల్ హీరోయిన్ మాళవిక మోహనన్.. ప్రభాస్ 'రాజా సాబ్'తో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. (ఆగస్టు 4) ఆమె పుట్టినరోజు సందర్భంగా మూవీ టీమ్ బర్త్ డే విషెస్ తో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్ లో చీరకట్టులో ట్రెడిషనల్ గా కనిపించి ఆకట్టుకుంటోంది మాళవిక. కొద్ది రోజుల క్రితం రిలీజ్ చేసిన 'రాజా సాబ్' టీజర్ లో మాళవిక అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ మూవీలో మాళవిక నటన, అందం ప్రత్యేక ఆకర్షణ కానుంది. 'రాజా సాబ్' లాంటి క్రేజీ మూవీతో తెలుగు ఆడియన్స్ కు పరిచయం కావడం ఎంతో స్పెషల్ గా భావిస్తోంది మాళవిక మోహనన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'రాజా సాబ్' చిత్రాన్ని డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 5న హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## రాజమౌళి-మహేష్ సినిమాపై క్రేజీ అప్ డేట్?





దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు సినిమాను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఐతే, ఇప్పుడు ఈ సినిమా పై మరో క్రేజీ గాసిప్ వినిపిస్తోంది. అయితే, ఈ సినిమా ఇంటర్వెల్ సీక్వెన్స్ మొత్తం ఓ లోయలో జరుగుతుందని.. ముఖ్యంగా ఫారెస్ట్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయని తెలుస్తోంది. లోయ లోపల చేసే ఛేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ ఓ రేంజ్ లో ఉంటుందట. అన్నట్టు ఈ సినిమాలో మహేష్ చేస్తున్న రోల్ లో చాలా వేరియేషన్స్ ఉంటాయట.

కాగా ఆ మధ్య విజయేంద్రప్రసాద్ ఈ సినిమా కథ గురించి ఓ ఇంటర్వ్యూలో చెబుతూ.. 'నేను, రాజమౌళి ఇద్దరం దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ కు పెద్ద అభిమానులం. అందుకే ఆయన పుస్తకాల ఆధారంగానే ఈ సినిమా స్క్రిప్ట్ ను రాశాను' అంటూ చెప్పుకొచ్చారు. కాబట్టి రాజమౌళి - మహేష్ సినిమా ఒక అడ్వెంచర్ థ్రిల్లర్ గా ఉండబోతుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయేంద్రప్రసాద్ కథ, దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు.



## ఫిష్ వెంకట్ కుటుంబాన్ని పరామర్శించిన సోనూ సూద్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ అనారోగ్యంతో మరణించారు. కిడ్నీల సమస్యతో ఆస్పత్రిలో చేరిన ఫిష్ వెంకట్ కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. పూర్తి గా ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలోనే కన్నుమూశారు. ఫిష్ వెంకట్ మృతితో టాలీవుడ్ లో తీవ్ర విషాదం నెలకొంది. ఎంతో మంది ఆర్థికసాయం అందించినప్పటికీ అతని ప్రాణాలు కాపాడలేకపోయారు.

ఆ తర్వాత ఈ విషయం తెలుసుకున్న బాలీవుడ్ నటుడు సోనూ సూద్ సైతం ఫిష్ వెంకట్ కుటుంబానికి అండగా నిలిచారు. తన వంతు సాయంగా లక్షన్నర రూపాయలు వారి కుటుంబానికి అందజేశారు. అంతే కాకుండా వ్యక్తిగతంగా ఫిష్ వెంకట్ కుటుంబాన్ని కలుస్తానని కూడా చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం తాజాగా ఇవాళ హైదరాబాద్ కు సోనూ సూద్ వచ్చారు. అనంతరం అడ్డగుట్టలోని ఫిష్ వెంకట్ నివాసానికి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కాగా.. జూనియర్ ఎన్టీఆర్ అదుర్స్ సినిమాతో ఫేమస్ అయిన ఫిష్ వెంకట్ పలు టాలీవుడ్ చిత్రాల్లో మెప్పించారు. ఆ తర్వాత గబ్బర్ సింగ్, ఖైదీ నంబర్ 150, శివం లాంటి చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించారు. కమెడియన్ గా మాత్రమే కాదు విలన్ పాత్రల్లోనూ అభిమానులను మెప్పించారు. ఫిష్ వెంకట్ చివరిసారిగా కాఫీ విత్ ఎ కిల్లర్ లో కనిపించాడు.



## మొటిమలు పోవాలంటే.. తమన్నా చిట్కా

అందమైన ప్రేమరాణి లేత బుగ్గపై.. చిన్న మొటిమ కూడా ముత్యమేలే..' అని ఓ సినీ కవి గొప్పగా రాశారు. అయినప్పటికీ కేవలం మిల్లీమీటర్ ఉండే పింపుల్..! మన మనసంతా భారంగా మారుస్తుంది. ఆ మొటిమల వల్ల తమ అందం తరిగిపోతుందని ముఖ్యంగా యువత ఉక్కిరిబిక్కిరవుతుంది. అవి తగ్గడం కోసం వంటింటి చిట్కాలు, డెర్మటాలజిస్టు అపాయింట్ మెంట్లు, క్రీములు, సబ్బులు... ఇలా అన్ని విధాలా ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలాంటి వారికోసం మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా ఓ సహజ సిద్ధమైన చిట్కా గురించి ఇటీవల ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అయితే అది కాస్త అసాధారణంగా ఉండటంతో చర్చనీయంగా మారింది. ఆమె ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చర్మ సౌందర్యం గురించి మాట్లాడారు. మొటిమలకు ఉదయపు ఉమ్మి.. అద్భుతంగా పనిచేస్తుందన్నారు. 'ఉమ్మితో మొటిమలను నివారించుకోవచ్చు. అంటే.. ముఖ్యంగా ఉదయాన వచ్చే ఉమ్మితో పింపుల్స్ సమస్య నుంచి ఎంచక్కా బయటపడొచ్చు' అని చెప్పారు. అలాగే దీని వెనక ఓ సైంటిఫిక్ రీజన్ కూడా ఉందంటూ వివరించారు.

'దీని వెనక సైన్స్ ఉంది. ఎలా అంటే.. మనం ఉదయం నిద్ర లేవగానే మన నోట్లోని సలైవా(ఉమ్మి)లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అవి మొటిమలతో పోరాడతాయి. అయితే నేను డాక్టర్ ని కాదు. కానీ ఇది నా పర్సనల్ చిట్కా. మొటిమల విషయంలో ఇది వర్కౌట్ అవుతుందని నేను నమ్ముతున్నా. మనం నిద్రలేచేటప్పటికే మన శరీరం చాలా యాంటీ బ్యాక్టీరియల్ ఎలిమెంట్స్ ను నోట్లో తయారు చేసుకుంటుంది. మేల్కొన్న తర్వాత మన కంట్లో, ముక్కులోనూ మ్యూకస్ ఉంటుంది. అలాగే అప్పటికింకా మనం బ్రష్ చేసి ఉండం కాబట్టి.. మన నోరు చాలా రకాలైన బ్యాక్టీరియాతో యుద్ధం చేసి ఉంటుంది. మనం గనక ఆ ఉదయపు ఉమ్మిని మొటిమ మీద రాస్తే.. అది వెంటనే మానిపోయేలా చేస్తుంది' అని ఆమె వివరించారు.

అలాగే ఇతర చర్మ సంరక్షణ విధానాల గురించి కూడా ఆమె కొన్ని సూచనలు చేశారు. 'నేను 24, 25 ఏళ్ల వయసు నుంచే చర్మ సంరక్షణ కోసం శ్రద్ధ తీసుకుంటున్నాను. అలాగే వృద్ధాప్య ఛాయలను తగ్గించుకోవాలనుకుంటే.. 25 సంవత్సరాల వయసు నుంచే యాంటీ ఏజింగ్ క్రీమ్ లను ఉపయోగించడం మంచిది. ఆ ఏజ్ నుంచే ఇలా చేస్తే.. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది' అని ఆమె తన అభిమానులకు సలహా ఇచ్చారు. తమన్నా.. టాలీవుడ్ లో ఇటీవల 'ఓదెల 2'లో అఘోరీ పాత్రలో తన నటనతో మెప్పించారు. అలాగే బాలీవుడ్ లో 'రైడ్ 2'లో 'నషా' అనే సాంగ్ లో తళుక్కున మెరిశారు.

## టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్‌కు షాక్.. ఫిల్మ్ ఛాంబర్ సంచలన నిర్ణయం!

టాలీవుడ్ లో సినీ వర్కర్స్ వేతనాల పెంపు కోరుతూ బంద్ కు పిలుపునివ్వడంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 30 శాతం వేతనాలు పెంచినవారి షూటింగ్ లకే హాజరవ్వాలని నిర్ణయించడంపై తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వేతనాల పెంపుపై ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియచేసిన తరువాత మాత్రమే విధులకు వెళ్లాలని నిర్ణయించడం చాలా బాధాకరమని పేర్కొంది. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు లేఖను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తెలుగు ఫిలిం చాంబర్ ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేసింది. నిర్మాతలు ఎవరైతే నైపుణ్యం కలిగిన పే వర్కర్స్ తామివ్వగలిగే వేతనానికి పనిచేస్తారో వాళ్లతో షూటింగ్స్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపింది. ఎంతోమంది ఔత్సాహిక నిపుణులు/కార్మికులు ఇండస్ట్రీలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. యూనియన్లలో సభ్యత్వం కొరకు లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తూ యూనియన్లు అవరోధం కలిగిస్తున్నాయని లేఖలో వివరించింది. ఇది నైపుణ్యవంతులైన కార్మికుల పొట్ట కొట్టడమేనని వెల్లడించింది. ప్రతి ప్రాజెక్టు అవసరాలు, వ్యక్తుల సామర్థ్యాల ఆధారంగా కార్మికులతో కలిసి పనిచేసే పూర్తి స్వేచ్ఛ నిర్మాతలకు ఉంటుందని తెలిపింది. ఎవరైనా ఔత్సాహిక నిపుణులు / కార్మికులు సినీ రంగంలో పనిచేయాలంటే వారితో పని చేయించుకోవడానికి నిర్మాతలందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారని స్పష్టం చేసింది. లక్షలాది రూపాయలు సభ్యత్వం కొరకు కట్టవలసిన పని లేదు.. నైపుణ్యం ఉన్న కార్మికునికి పని కల్పించడమే మా ధ్యేయమని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ లేఖ విడుదల చేసింది. మన ఫిలిం ఇండస్ట్రీ మనుగడ కోసం నిర్మాత శ్రేయస్సు అతి ముఖ్యమైన విషయమని కార్మిక సంఘాలు మరొక్కసారి గుర్తించాలని కోరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చిన్న నిర్మాతలు భరించలేని స్థాయిలో వేతనాలు పెంపును యూనియన్స్ డిమాండ్ చేయటం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో 30 శాతం వేతనాల పెంపును నిర్మాతలందరూ వ్యతిరేకిస్తున్నట్లు లేఖలో పేర్కొంది. కనీస వేతనాల చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారని వెల్లడించింది. అంతేకాకుండా కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేసిందని వివరించింది. కాస్ట్ ఆఫ్ లివింగ్ విషయంలో మిగతా మెట్రోపాలిటన్ పట్టణాలతో పోలిస్తే మన హైదరాబాద్లో తక్కువని తెలిపింది. అయిన్పటికీ మనం అన్ని యూనియన్ల వారికి ఎక్కువ వేతనాలు చెల్లించడం జరుగుతోందని పేర్కొంది. ఇతర రాష్ట్రాల చలన చిత్ర పరిశ్రమలో ఇచ్చే వేతనాల కంటే మన తెలుగు రాష్ట్రాలలో పని చేసే కార్మికులకు అధిక వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించింది.

